

జై భీమ

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా



సంపుటి - 07 | సంచిక 357 | ఎడిటర్ : బరిగెల శివ | శనివారం 28, నవంబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్

డీ లిమిటేషన్.. యమ డేంజర్ !

దేశాన్ని మరింత నాశనం చేసే కుట్రలు పన్నుతున్నారు

ఎంపీల కొనుగోలుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు !

బలనిరూపణ కోసం జరుగుతున్న బలవంతపు కుట్రలు

దక్షిణాది రాష్ట్రాల పరిస్థితి ఏమిటి

దేశ నాశనమే రాజకీయ లక్ష్యమా

దేశంలో ఉద్యమాల తీవ్రతను తట్టుకోలేక అడ్డుదారి మార్గాలను ఎంచుకుంటున్నారు

దేశంలో ప్రజాభివృద్ధి శూన్యం రాజకీయ అభివృద్ధి గణనీయం

దేశాన్ని కాపాడుకోలేకపోతే ప్రజలు బతకడం కష్టమే

రాహుల్ గాంధీ సుప్రీంకోర్టులో వేసిన కేసులకు ప్రభుత్వ సమాధానమెక్కడ

సుప్రీంకోర్టులో జాతీయ ఎన్నికల కమిషన్ పై కేసులు నడుస్తున్నాయి

మోడీ అమిత్ షాలపై సుప్రీంకోర్టు న్యాయవాదులు కేసులు వేశారు

మోడీ జపమే దేశాన్ని దరిద్రపు ఊబిలోనికి నెట్టివేస్తుంది

డాక్టర్ బరిగెల శివ

దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చబోతున్న డీలిమిటేషన్ ప్రక్రియపై దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది.. లోక్‌సభ స్థానాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యానికి ఎలాంటి మార్పులు వస్తాయి? జనాభా ప్రాతిపదికన సీట్ల కేటాయింపులు జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందా? ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య రాజకీయ సమతుల్యత దెబ్బతింటుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఎంపీల సంఖ్య పెంపు వెనుక కేంద్ర ప్రభుత్వ అసలు ఉద్దేశం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజా సమస్యలకు పరిష్కారం చూపకుండా రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల వ్యవస్థ, రాజ్యాంగ సంస్థల పనితీరుపై కూడా వివాదాలు కొనసాగుతున్నాయి. డీలిమిటేషన్ ప్రక్రియలో అన్ని రాష్ట్రాల అభిప్రాయాలకు సముచిత ప్రాధాన్యత ఇవ్వాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. రాష్ట్రాల హక్కులు, సమాఖ్య స్ఫూర్తి, రాజకీయ సమానత్వం పరిరక్షణ ఇప్పుడు కీలకంగా మారాయి. దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలపై కేంద్రం పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. - హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

2



డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్





అంతర్జాతీయ పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక ఇబ్బందులు..

యువ క్రీడాకారుడు కార్తీక్‌కు డాక్టర్ బరిగెల శివ భరోసా!

దాతలు ముందుకు రాకపోయినా..

కార్తీక్ ఆట ఆగకుండా నేనే సహాయం చేయడానికి సిద్ధం..

డాక్టర్ బరిగెల శివ హామీ

2





వ్యవసాయం నుంచి పారిశ్రామిక రంగం వరకు ప్రత్యేక కార్యాచరణ

నిధులు కేటాయించినంత మాత్రాన అభివృద్ధి జరిగినట్లు కాదు..

అర్హులకు ప్రతి రూపాయి చేరాలి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

రూ.242 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

విద్యార్థుల ఉపకార వేతనాలు, గురుకులాల అభివృద్ధికి ప్రాధాన్యం

వారం రోజుల్లో కార్యాచరణ ప్రణాళికలు సమర్పించాలని అధికారులకు ఆదేశం

7

తెలుగు రాష్ట్రాల అయ్యప్ప భక్తులకు అలర్ట్..

కొల్లాంకు ప్రత్యేక రైళ్లు, రేపటి నుంచే రిజర్వేషన్లు

శబరిమల భక్తుల కోసం కొల్లాంకు ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి ప్రత్యేక సర్వీసులు

తెలుగు రాష్ట్రాల మీదుగా రాకపోకలు

శనివారం ఉదయం 8 గంటల నుంచి ముందస్తు రిజర్వేషన్లు

మండలం, మకరవిళక్కు సీజన్ దృష్ట్యా రైల్వే శాఖ నిర్ణయం

2

నషా ముక్త్ భారత్.. కిషన్ రెడ్డి పాదయాత్రలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించిన నాగార్జున

నషా ముక్త్ భారత్.. డ్రగ్స్ కు వ్యతిరేకంగా కేంద్రం జాతీయ కార్యక్రమం

కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ లో పాదయాత్ర

మూడో రోజు యాత్రలో పాల్గొన్న అగ్రనటుడు నాగార్జున

డ్రగ్స్ రహిత భారత్ కోసం ప్రతిజ్ఞ చేయించిన నాగార్జున

యాత్రకు మద్దతు తెలిపిన పలువురు సినీ ప్రముఖులు

ముగింపు వేడుకకు చిరంజీవి, శ్రీశ్రీ రవిశంకర్ హాజరు

2



ఆస్తి నేరాల నియంత్రణకు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలి

సైబర్ నేరాల నగదు రికవరీలో కామారెడ్డి పోలీసుల పనితీరుపై డీజీపీ సి.వి.ఆనంద్ ప్రశంసలు

అంతర్రాష్ట్ర ముఠాల కట్టడికి ఆపరేషన్ కవచ్..

కామారెడ్డి, బాన్సువాడలో పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

2

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

నషా ముక్త్ భారత్.. కిషన్ రెడ్డి పాదయాత్రలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించిన నాగార్జున

హైదరాబాద్, నవంబర్ 27 (జై భీమ్ న్యూస్) :

మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి హైదరాబాద్‌లో చేపట్టిన పాదయాత్రకు సినీ ప్రముఖుల నుంచి విశేష మద్దతు లభిస్తోంది. 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' పేరుతో మూడు రోజులుగా జరుగుతున్న ఈ యాత్ర చివరి రోజైన శుక్రవారం, ప్రముఖ నటుడు నాగార్జున అక్కినేని పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్రగ్స్ రహిత సమాజం కోసం ఆయన ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అంబర్‌పేట్‌లో ప్రారంభమైన ఈ పాదయాత్ర ముగింపు రోజున అమీర్‌పేట వద్ద నాగార్జున జత కలిశారు. ఆయనతో పాటు నటుడు సాయికుమార్, దర్శకుడు బోయపాటి శ్రీను, హాస్యనటుడు శివారెడ్డి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పించిన 'నషా ముక్త్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా ఈ యాత్ర జరగడం అభినందనీయమన్నారు. ఈ బృహత్ కార్యక్రమంలో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. "వ్యక్తిగతంగా నేను డ్రగ్స్‌కు దూరంగా ఉండటమే కాకుండా, నా కుటుంబాన్ని, స్నేహితులను, చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా డ్రగ్స్ బారిన పడకుండా కాపాడేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తాను" అని నాగార్జున ప్రతిజ్ఞ చేయించారు. నటుడు సాయికుమార్ 'నషా ముక్త్ భారత్ – మేం చేసి తీరుతాం' అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఢిల్లీలో అత్యవసర కేబినెట్ సమావేశం ఉన్నప్పటికీ, పాదయాత్రను కొనసాగించాలని ప్రధానమంత్రి తనకు సూచించారని తెలిపారు. ప్రజల నుంచి యాత్రకు అద్భుతమైన స్పందన వస్తోందన్నారు. జూబ్లీహిల్స్‌లో జరిగే ముగింపు కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ హాజరవుతారని వెల్లడించారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఇప్పటికే బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ వంటి ప్రముఖులు కూడా పాల్గొని తమ మద్దతు తెలిపారు. యువతను మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి రక్షించడానికి సామూహిక బాధ్యతతో పనిచేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

తెలుగు రాష్ట్రాల అయ్యప్ప భక్తులకు అలర్ట్..

శబరిమల అయ్యప్ప భక్తులకు భారతీయ రైల్వే శుభవార్త తెలిపింది. మండల-మకరవిళక్కు యాత్ర సీజన్ రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలుగు రాష్ట్రాల నుంచి కేరళకు నడపనున్న ప్రత్యేక రైళ్ల ముందస్తు రిజర్వేషన్లు రేపు (శనివారం) ప్రారంభం కానున్నాయి. రేపు ఉదయం 8:00 గంటల నుంచి ప్రయాణికులు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, రైల్వే కౌంటర్ల ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. సిర్పూర్ కాగజ్‌నగర్, హైదరాబాద్‌ల నుంచి కొల్లాం వరకు ఈ వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోకలు సాగిస్తాయి.

హైదరాబాద్ – కొల్లాం ప్రత్యేక రైలు

హైదరాబాద్ – కొల్లాం ప్రత్యేక రైలు (07187) డిసెంబర్ 4, 18 తేదీల్లో (శుక్రవారాలు) ఉదయం 9:00 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 4:55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో (07688) డిసెంబర్ 5, 19 తేదీల్లో రాత్రి 7:30 గంటలకు కొల్లాంలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 7:00 గంటలకు కాజీపేట చేరుకుని ప్రయాణాన్ని ముగిస్తుంది. ఈ రైలు లింగంపల్లి, వికారాబాద్, తాండూర్, రాయచూర్, మంత్రాలయం రోడ్, గుంతకల్, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లె, పీలేరు, చిత్తూరు మీదుగా ప్రయాణిస్తుంది.

సిర్పూర్ కాగజ్‌నగర్ – కొల్లాం ప్రత్యేక రైలు

సిర్పూర్ కాగజ్‌నగర్ – కొల్లాం రైలు (07171) డిసెంబర్ 11, 25 తేదీల్లో తెల్లవారుజామున 4:00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 4:55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. ఈ సర్వీస్ బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి, కాజీపేట, సికింద్రాబాద్, ఏపీలోని పలు ప్రాంతాల మీదుగా నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో (07172) డిసెంబర్ 12, 26 తేదీల్లో రాత్రి 7:30 గంటలకు కొల్లాంలో బయలుదేరి, మరుసటి తెల్లవారుజామున 4:00 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుం. ఈ సర్వీస్ తిరుగు ప్రయాణంలో సిర్పూర్ కాగజ్‌నగర్ వరకు వెళ్లకుండా హైదరాబాద్‌లోనే ముగుస్తుంది. డిసెంబర్ 27 వరకు మండల పూజలు, అనంతరం జనవరి మధ్య వరకు మకరవిళక్కు యాత్ర కొనసాగనున్నందున భక్తులు రేపు ఉదయం 8:00 గంటలకు ప్రారంభమయ్యే రిజర్వేషన్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

జగన్‌కు ఓటు బ్యాంకు పదిలం

కడప, నవంబరు 27 (జై భీమ్ న్యూస్) :

వైసీపీ అధినేత వైఎస్ జగన్ ను తక్కువగా అంచనా వేయకూడదు. ఇది ఎవరో అంటున్న మాట కాదు. స్వయానా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడే పార్టీ నేతలతో అన్నారంటే జగన్ విషయంలో ఎంత కూటమి ప్రభుత్వం భయపడుతుందన్నది అర్థమవుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగడానికి కూడా కారణం ఆయనకు తెలుసు. 2024 ఎన్నికల్లో జగన్ పార్టీకి అంత వేవ్ లోనే 40 శాతం ఓట్లు లభించడాన్ని చంద్రబాబు నాయుడు వంటి అపార రాజకీయ అనుభవం ఉన్న నేత మర్చిపోరు. అందుకే నేతలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుంటారు. ఒక్కోసారి కూటమిలో ఉన్నా, మీడియా అండ ఉన్నా ప్రజల తీర్పు ఎలా ఉంటుందన్నది చంద్రబాబుకు తెలుసు. అందుకే చంద్రబాబు జగన్ ను ఎప్పుడూ తక్కువగా అంచనా వేయకుండా పార్టీ నేతలకు హెచ్చరికలు చేస్తూనే ఉన్నారు. మరొకవైపు కూటమి విషయంలోనూ ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా స్మూత్ గా డీల్ చేస్తున్నారు. కానీ పార్టీ కార్యకర్తలు మాత్రం ఒంటరిగా పోటీ చేసినా గెలిచే అవకాశాలున్నాయని చెప్పినా చంద్రబాబులో మాత్రం ఆ విశ్వాసం లేదు. పదకొండు సీట్లతో సరిపెట్టుకున్నా జగన్ స్థానికసంస్థల ఎన్నికల్లో క్యాడర్ లను, లీడర్లను ఎలా పరిగెత్తించారో అర్థమవుతుంది. ఓటమితో జగన్ అనేక పాఠాలు నేర్చుకుని ఉంటారు. జగన్ దేనినీ లెక్క చేయరని కూడా తెలుసు. గెలిచినప్పుడు వెంట నడిచేవాళ్లు వేలమంది ఉంటారు. కానీ అధికారం కోల్పోయినప్పుడు, నమ్ముకున్నవాళ్లు దూరమైనప్పుడు, చుట్టూ ప్రత్యర్థులు మోహరించినప్పుడు నిలబడి పోరాడటమే నాయకత్వానికి అసలైన పరీక్ష అని జగన్ కు తెలియంది కాదు. వైఎస్ జగన్ రాజకీయ జీవితంలో ఎన్నో ఉత్థాన పతనాలను చూశారు. ఒకప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ అధిష్టానాన్నే ఎదరించారు. జగన్‌కు రాజకీయంగా ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ అధిష్టానంతో విభేదించి, సొంత పార్టీని స్థాపించి రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి సక్సెస్ ఫుల్ పొలిటికల్ లీడర్ గా ఎదిగినట్లే ప్రత్యర్థులు కూడా భావిస్తారు. జగన్ కు 2014లో ఓటమి ఎదురైంది. అయినా రాజకీయాలకు దూరం కాలేదు. ప్రజల మధ్యకు వెళ్లారు. 3,648 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర చేశారు. ప్రజల కష్టాలను వింటూ, తన రాజకీయ బలాన్ని పెంచుకుంటూ 2019లో 175 అసెంబ్లీ స్థానాలకు గాను 151 స్థానాలను గెలుచుకున్నారు. ఇప్పుడు పదకొండు సీట్లు ఇచ్చినా, ప్రతిపక్ష హోదా లేదని ఆయనను వెక్కిరింపులు చేసినా అది పైపై మాటే. తిరిగి పుంజుకోవడానికి ఆయన ఖచ్చితంగా ఎత్తుగడలు వేరే విధంగా ఉంటాయి. సహజంగా అధికారంలో ఉండే ప్రభుత్వ వ్యతిరేకతను సొమ్ము చేసుకోవడానికి జగన్ ఆఖరి ప్రయత్నం కూడా చేస్తారు. జగన్ చేతిలో మీడియా లేకపోవచ్చు.

'డీ'లిమిటేషన్ యమ 'డేంజర్'

దేశాన్ని మరింత నాశనం చేసే కుట్రలు పన్నుతున్నారు
ఎంపీల కొనుగోలుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు !
బలనిరూపణ కోసం జరుగుతున్న బలవంతపు కుట్రలు
దక్షిణాది రాష్ట్రాల పరిస్థితి ఏమిటి
దేశ నాశనమే రాజకీయ లక్ష్యమా
దేశంలో ఉద్యమాల తీవ్రతను తట్టుకోలేక అడ్డదారి మార్గాలను ఎంచుకుంటున్నారు
దేశంలో ప్రజాభివృద్ధి శూన్యం రాజకీయ అభివృద్ధి గణనీయం
దేశాన్ని కాపాడుకోలేకపోతే ప్రజలు బతకడం కష్టమే
రాహుల్ గాంధీ సుప్రీంకోర్టులో వేసిన కేసులకు ప్రభుత్వ సమాధానమెక్కడ
సుప్రీంకోర్టులో జాతీయ ఎన్నికల కమిషన్ పై కేసులు నడుస్తున్నాయి
మోడీ అమిత్ షాలపై సుప్రీంకోర్టు న్యాయవాదులు కేసులు వేశారు
మోడీ జపమే దేశాన్ని దరిద్రపు ఊబిలోనికి నెట్టివేస్తుంది
డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్(జై భీమ్ డెస్క్)

దేశంలో కేంద్ర ప్రభుత్వం అవలంబించబోతున్న "డీ"లిమిటేషన్ దాడుల ప్రక్రియ దేశ పురోగతిని పూర్తిస్థాయిలో దెబ్బ కొడుతుందని డాక్టర్ బరిగెల శివ అభివర్ణించారు. డీలిమిటేషన్ దేనికి మంచిదో మొదటగా దేశ ప్రజలకు తెలియజేయాల్సిన ఆవశ్యకత అత్యవసరం కేంద్ర ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. కేవలం ఉత్తరాది రాష్ట్రాల అభివృద్ధి కోసం ఉత్తరాది రాష్ట్రాలను బలపరచడం కోసం ఆయా రాష్ట్రాలకు పెరుగుతున్న మర్యాదనుబట్టి దక్షిణాది రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వ మద్దతు తగ్గిపోతూ ఉండగా ఆయా దక్షిణాది రాష్ట్రాల పరిస్థితి ఏమిటంటూ దేశంలో తీవ్రమైన చర్చ కొనసాగుతుందన్నారు.రూట్ మ్యాప్ లేకుండా ప్రణాళికను సిద్ధం చేయడం దానిని ప్రవేశపెడుతుండడం ఎవరి లబ్ధి కోసమో దేశ ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలకు దేశం మేధావులకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అప్పట్లో జర్మనీ దేశం నేడు భారతదేశ నాశనం కోసం ఉరుకులాడడానికి ప్రధాన కారణం దేశ ప్రదానులను జపం చేయడమేనని మండిపడ్డారు. అత్యంత విలువైన ఖర్చుతో కూడుకొనిన "డీ"లిమిటేషన్ ప్రక్రియను దేశం అప్పులు పీకలలోకతు కష్టాల్లో ఉండంగా ప్రవేశపెట్టాలని చూడడం దారుణం అన్నారు. అన్ని రాష్ట్రాల ప్రభుత్వాల అనుమతులతో అసెంబ్లీల తీర్మానాలు అంగీకారంతో కేంద్రం ఏ బిల్లులైన ప్రవేశపెట్టాల్సి ఉంటుండగా దేశంలో పేరుకుపోయిన సమస్యల పట్ల చిత్తశుద్ధి కనపరచకుండా ఉన్నపాటుగా డీ లిమిటేషన్ పేరును ముందుకు తీసుకురావడం ఇంచుమించు దేశాన్ని మరింత నాశనంలోనికి నెట్టివేయడమేనన్నారు. దక్షిణాది రాష్ట్రాలు ఇప్పటికే అత్యంత కష్టకాలంలో ఉంటుండగా డీలిమిటేషన్ బిల్లుతో మరింత తీవ్రనష్టంలోకి నెట్టివేయబడే ఆస్కారం ఉందని పేర్కొన్నారు. అసలు కైతే డీలిమిటేషన్ బిల్ అనేది భారత రాజ్యాంగానికి పూర్తి విరుద్ధమని కేంద్ర ప్రభుత్వ పాలకులకు తెలిసినప్పటికిని బలవంతంగా బిల్లు ప్రవేశపెట్టాలని చూడడంలో అంతర్యం ఏమిటో పాలకులకే అర్థం కావడం లేదని ఇక దేశ ప్రజలకు ఆయా ప్రభుత్వ పాలకులకు మేధావులకు ఏ విధంగా అర్థం అవుతుందో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాలు స్పష్టం చేయాల్సి ఉందని సూటిగా నిలదీశారు. దేశంలో ప్రభుత్వ అధికార వర్గం గుట్టుచప్పుడు కాకుండా కేంద్ర ప్రభుత్వానికి సహకరిస్తుండడం దేశానికి ప్రమాదం అని తెలిసినప్పటికిని అధికార హోదాలో ఆస్తులు సంపాదించుకుంటూ వాటిని కాపాడుకునే ప్రయత్నంలో భాగంగానే కేంద్ర ప్రభుత్వానికి వెన్నుదండుగా నిలుస్తున్నారని హెచ్చరించారు. మరోవైపు మేధావులు దేశ పాలకుల పట్ల దేశం పాలించబడుతున్న విధానాల పట్ల మౌనం వహించడం దేశ నాశనానికి నాంది లాంటిదని వర్ణించారు. దేశంలో ఎక్కడ చూసినా కవులు కళాకారులు ఉద్యమకారులు కార్మికులు ప్రజలు మాత్రమే దేశ పాలనపై పోరాటాలు చేస్తున్నారని ఆకాస్త పోరాటాల వల్ల దేశంలో బిజెపి పార్టీ అహంకార పాలనకు కాస్తంత స్వస్తి పలికే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.

పోరాటాల ఫలితాలు వృధాగా పోతున్నాయి..

దేశవ్యాప్తంగా న్యాయం కోసం జరిగే పోరాటాలు నామమాత్రానికేనా అంటూ ప్రజలు ఒకవైపు ఆవేదన వ్యక్తం చేస్తుంటే దేశపాలకులు న్యాయం కోసం జరుగుతున్న పోరాటాలను నామమాత్రంగా పరిగణిస్తూ కేవలం అణిచివేత ధోరణితో మాత్రమే న్యాయ పోరాటాలను చూస్తున్నారు తప్ప దేశానికి ఏది ఉపయోగమో ఏది నిరూపయోగమో వాటిని గమనించి పరిగణలోనికి తీసుకుందామనే ఆలోచన దేశ పాలకులకు ఇప్పటికీ కలగకపోవడం తీవ్రమైన విచారకరమన్నారు. ఇప్పటికే దేశ ఎన్నికల కమిషన్ అమ్ముడుపోయిందని దేశంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు జరుగుతుండగా ఉన్న పాటుగా 700 పైగా ఎంపీల సీట్లు ఏం ఉద్ధరించడానికి సిద్ధం చేస్తున్నారో బిజెపి ప్రభుత్వానికే తెలియాలన్నారు. 12 సంవత్సరాల దేశపాలనలో పలు ప్రభుత్వాలను అప్రజాస్వామికబద్ధంగా కూలదోచ్చి ఆయా రాష్ట్రాల్లో బిజెపి ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకున్న కేంద్ర ప్రభుత్వం ఎంతకైనా దిగజారి తెగిస్తుందనేది తెలిసిపోతుందన్నారు. ఒకవైపు దేశ ఆర్థిక భారాన్ని ఎవరు భరించాలో తెలియక సామాన్య ప్రజలు చస్తూ బ్రతుకుతుండగా రానున్న ఎన్నికల్లో రాజకీయంగా గద్దెనెక్కడానికి ఒకటే మార్గమని భావించిన కేంద్ర ప్రభుత్వం ఆ వైపుగా వేగంగా ముందుకు సాగడం తీరని అన్యాయం అన్నారు. దేశ ప్రజల సమస్యలపై స్పందించిన దాఖలాలు లేవుగాని ఉన్నపాటుగా రాజకీయ చట్టాలను మార్చేసుకుని మరొకసారి దేశ ప్రజలను మోసం చేయాలు కుట్రలు విపరీతంగా పెరుగుతున్నాయని అన్నారు. ఇప్పటికే సుప్రీంకోర్టులో జాతీయ ఎన్నికల కమిషన్ పై సుప్రీంకోర్టు న్యాయవాదులు కేసులు వేయగా అందులో ప్రధానమైన వ్యక్తులను దేశ ప్రధాని మోడీ అమిత్ షా జాతీయ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ లనుండి దేశాన్ని రక్షించాలంటూ దావాలు వేయబడగా వాటికి ఇప్పటివరకు సమాధానం చెప్పకుండా దొడ్డిదారి మార్గంలో చట్టాలను లోపర్చుకోవడం ఘోరమైన నేరమన్నారు. దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సుప్రీంకోర్టులో వేసిన కేసులకు కేంద్ర ప్రభుత్వం గానీ జాతీయ ఎన్నికల కమిషన్ గాని ఇప్పటివరకు సమాధానం ఇవ్వకుండా జవాబుదారీతనాన్ని మర్చిపోయి పార్లమెంటులో కొత్త చట్టాన్ని ప్రవేశపెట్టాలని చూడడం పచ్చి మోసమన్నారు. సుప్రీంకోర్టు న్యాయస్థానాన్ని కూడా ధిక్కరించి పాలిస్తే దాన్ని పాలన ఎలా అంటారంటూ సూటిగా నిలదీశారు.మొదటగా కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేయబడిన కేసులకు సమాధానం చెప్పి వాటినుండి బయటపడ్డాక తమ ఆలోచనలను తమ వైఖరిని ముందుకు తీసుకురావాలని సూటిగా ప్రశ్నించారు. దేశంలో ప్రజలందరూ కేంద్ర ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తుండగా దానిని తట్టుకోలేక దొడ్డిదారి మార్గంలో దేశ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నా కేంద్ర ప్రభుత్వ ఆగడాలను దేశంలోని అన్ని వర్గాల ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజల తిరుగుబాటును తట్టుకోలేక కేంద్ర ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలను అమలుపరచుకునే ప్రయత్నాలు చేస్తుందని అలాంటి ప్రయత్నాలను దేశ ప్రజలు పూర్తిగా తిరస్కరిస్తున్నారని స్పష్టం చేశారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం రహస్యంగా ఎంపీల కొనుగోలుకు మంతనాలు జరుపుకున్నట్లు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారాలు సాగుతుండగా అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉంటూ డీలిమిటేషన్ నిరుపయోగాన్ని దేశ ప్రజలకు తెలియజేస్తూ సుప్రీంకోర్టులో నడుస్తున్న కేసులు పూర్తయ్యే వరకు నిలుపుదలన చేయాలని వాటి కోసం అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు పట్టుదలతో ముందుకు సాగాలని కోరారు. దేశంలో ఎక్కడ చూసినా దేశాన్ని విచ్ఛినం చేయాలనే కుట్రలు మరింతగా పెరిగిపోతూనే ఉన్నాయని మొత్తం మీదుగా భారత రాజ్యాంగాన్ని నాశనం చేసే కుట్రను పన్నుతున్న మోడీ అమిత్ షా జ్ఞానేష్ కుమార్ ఆగడాలను అరికట్టబడాలని పిలుపునిచ్చారు. కేవలం ముగ్గురు వ్యక్తులు దేశాన్ని పాలిస్తూ దేశాన్ని అన్ని విధాల నాశనం చేస్తుంటే ప్రభుత్వ వ్యవస్థలు న్యాయస్థానాలు చట్టాలు అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు గుట్టుచప్పుడు కాకుండా కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలకడం దేశాన్ని అధోగతి పాలు చేయడమే అన్నారు. డీలిమిటేషన్లో ఏ రాష్ట్రానికి ఎన్నిఎంపీ సీట్ల కేటాయింపు చేస్తున్నారో ఎన్నెన్ని సీట్లు పెంచుతున్నారో మొదటగా కేంద్ర ప్రభుత్వం శ్వేత పత్రం రూపంలో భారత రాష్ట్రపతి గెజిట్ రూపంలో స్పష్టంగా తెలియజేసిన తర్వాత అన్ని ప్రభుత్వాల ఆమోదం మేరకు తమ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని కోరారు. లేనియెడల దేశంలో కేంద్ర ప్రభుత్వంపై ప్రజలు ఉద్యమకారులు మేధావులు కార్మికుల తిరుగుబాటు మరింతగా పెరిగిపోయి దేశ పాలకులు అవస్థలు పడాల్సిన పరిస్థితులు ఏర్పడగలదన్నారు. సమస్యలను సృష్టించడం వాటిని జఠలం చేయడం కేంద్ర ప్రభుత్వానికి కొత్తవి కానప్పటికీ ఒక్కరోజు రాత్రి నోట్ల మార్పిడిని ప్రవేశపెట్టి దేశాన్ని ఎంతటి ఆపదలోనికి నెట్టివేశారో ప్రస్తుతం దేశంలో డీ లిమిటేషన్ అనే బిల్లు కూడా ఇంచుమించు అదే రకమైనదని దాని నుండి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ యువతదేనంటూ స్పష్టంగా తెలియజేశారు.

అంతర్జాతీయ పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక ఇబ్బందులు..

యువ క్రీడాకారుడు కార్తీక్‌కు డాక్టర్ బరిగెల శివ భరోసా!
దాతలు ముందుకు రాకపోయినా..
కార్తీక్ ఆట ఆగకుండా నేనే సహాయం చేయడానికి సిద్ధం.. డాక్టర్ బరిగెల శివ హామీ

హైదరాబాద్ తార్నాక నవంబర్ 27(జై భీమ్ న్యూస్)



హైదరాబాద్: కరాటే, బాక్సింగ్, జూడో, జియు-జిట్సు, వెపన్ విభాగాల్లో ప్రతిభ చాటుతూ గిన్నిస్ బుక్ రికార్డుతో గుర్తింపు పొందిన యువ క్రీడాకారుడు పర్శి కార్తీక్ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. నేపాల్‌లో డిసెంబర్ 24న జరగనున్న అంతర్జాతీయ జూడో పోటీల్లో పాల్గొనే అవకాశం లభించినప్పటికీ, ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడంతో పోటీలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. నేపాల్ ప్రయాణం, పోటీల్లో పాల్గొనేందుకు సుమారు రూ.50 వేల ఆర్థిక సహాయం అవసరమవుతోంది. ఈ నేపథ్యంలో కార్తీక్ జై భీమ్ టీవీ హెడ్ ఆఫీస్‌కు వచ్చి తన ఆర్థిక పరిస్థితిని జై భీమ్ టీవీ ఫౌండర్ & చైర్మన్ డాక్టర్ బరిగెల శివకు వివరించారు. యువ క్రీడాకారుడి సమస్యను తెలుసుకున్న డాక్టర్ బరిగెల శివ వెంటనే స్పందించి ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ బరిగెల శివ మాట్లాడుతూ.. కార్తీక్‌కు సహాయం చేసేందుకు దాతలు, క్రీడాభిమానులు ముందుకు రావాలని కోరారు. ఒకవేళ ఎవరూ ఆర్థిక సహాయం చేయకపోయినా, కార్తీక్ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం కోల్పోకుండా తానే స్వయంగా ఆర్థిక సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నానని మాట ఇచ్చారు. ప్రతిభ ఉన్న యువ క్రీడాకారుడి ఆట ఆగిపోకూడదని, ఆర్థిక పరిస్థితులు అతని లక్ష్యానికి అడ్డంకి కాకూడదని పేర్కొన్నారు. కార్తీక్ భవిష్యత్తులో భారతదేశానికి, తెలంగాణకు మరిన్ని పతకాలు, కప్పులు తీసుకురావాలని ఆకాంక్షించారు. సమాజంలో ప్రతిభ కలిగిన యువతను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు.

ఆర్థిక సహాయం చేయదలచిన వారు:

గూగుల్ పే / ఫోన్ పే: 8686863685
బ్యాంక్ ఖాతా: 44099099213
IFSC: SBIN0021108
బ్యాంక్: SBI, వరంగల్ బ్రాంచ్.

యువత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి





చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి - జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్, 27 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు వారిలో సృజనాత్మకత, కళా నైపుణ్యాలను ప్రోత్సహించేందుకు యువజనోత్సవాలు చక్కని వేదికలుగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్‌లోని ఎల్.బి. కళాశాలలో జిల్లా స్థాయి యువజనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత ఎలాంటి భయాందోళనలకు తావులేకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువతలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నిర్వహించిన ముగింపు వేడుకలకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీశాల ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తమలోని సృజనాత్మకతను, కళా నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేసుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. వివిధ రంగాల్లో తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఇలాంటి వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. జిల్లా యువజ, క్రీడల అధికారి బి. అనిల్ కుమార్ ఆధ్వర్యంలో యువజనోత్సవాలను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అతిథులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పుష్పలత, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బాలాజీ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీధర్ సుమన్, ఎల్.బి. కళాశాల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక, నెహ్రూ యువ కేంద్రం (ఎన్.వై.కే) కోఆర్డినేటర్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండలో సంతాన సాఫల్య కేంద్రాలపై రాష్ట్ర స్థాయి అధికారుల కొరడా!

అనుమతులు, రికార్డులు, నిర్వహణ తీరుపై క్షేత్రస్థాయిలో తనిఖీలు





హన్మకొండ, 27 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

హనుమకొండ జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిర్వహిస్తున్న సంతాన సాఫల్య కేంద్రాలపై రాష్ట్ర స్థాయి అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. సహాయక పునరుత్పత్తి సాంకేతికత (ఏఆర్‌టీ) విధానంలో పనిచేస్తున్న కేంద్రాల నిర్వహణ, అనుమతులు, రికార్డులపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. జాతీయ ఆరోగ్య మిషన్ తెలంగాణ రాష్ట్ర సంయుక్త సంచాలకులు, ముఖ్య సమాచార అధికారి బి. ప్రేమ్ కుమార్, సమాచార విశ్లేషకులు సాయి కుమార్ శుక్రవారం జిల్లాలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సద్గురు హెల్త్ కేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఓయసిస్ సంతాన సాఫల్య కేంద్రం, నోవా హెల్త్ కేర్, ఫర్టీ నైన్ సంతాన సాఫల్య కేంద్రం, ఒరిజిన్ ఏఆర్‌టీ కేంద్రం, బేబీ లైఫ్ ఆసుపత్రులను సందర్శించారు. ఆయా కేంద్రాల్లో నిర్వహిస్తున్న రికార్డులు, ప్రభుత్వ అనుమతి పత్రాలు, ధ్రువీకరణ పత్రాలు, నిర్వహణ విధానాలు, ఇతర సంబంధిత పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేంద్రాల నిర్వహణలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే ఏఆర్‌టీ కేంద్రాలకు వర్తించే నిబంధనల అమలు, వైద్య సేవల నాణ్యత, పారదర్శకమైన నిర్వహణకు సంబంధించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ తనిఖీల కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ప్రదీప్ రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్, సామాజిక ఆరోగ్య అధికారి మాధవ రెడ్డి, జిల్లా కార్యక్రమ అధికారి రుక్మిద్దిన్, సమాచార నిర్వాహకులు ప్రవీణ్, వినోద్, సందీప్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న కిరాణా వ్యాపారి అరెస్ట్

హసన్‌పర్తిలో పోలీసుల ఆకస్మిక దాడి.. రూ.4,365 విలువైన పొగాకు ఉత్పత్తులు స్వాధీనం : ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్

హసన్‌పర్తి, 27 నవంబర్ 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)

ప్రభుత్వం నిషేధించిన పొగాకు ఉత్పత్తులను అక్రమంగా విక్రయిస్తున్న కిరాణా దుకాణ యజమానిని హసన్‌పర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. అతని దుకాణంపై ఆకస్మిక దాడులు నిర్వహించి రూ.4,365 విలువైన నిషేధిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని ఓ కిరాణా దుకాణంలో ప్రభుత్వ నిషేధిత పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో పోలీసులు సదరు దుకాణంపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణంలో ప్లాస్టిక్ సంచిలో నిల్వ ఉంచిన నిషేధిత పొగాకు ఉత్పత్తులను గుర్తించారు. పంచుల సమక్షంలో దుకాణ యజమానిని విచారించగా, హసన్‌పర్తి గ్రామానికి చెందిన అనుగం సతీష్ (45)గా గుర్తించారు. అతని వద్ద నుంచి 7 అనార్ పౌచులు, 5 ఆర్.ఆర్ పొగాకు ప్యాకెట్లు, 5 అంబర్ పొగాకు ప్యాకెట్లు, 5 బాబా బ్లాక్ ప్యాకెట్లు, 9 అంబర్ పౌచులను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ.4,365గా పోలీసులు వెల్లడించారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిషేధిత పొగాకు ఉత్పత్తులను విక్రయించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమంగా పొగాకు ఉత్పత్తుల విక్రయాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రజలు ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్ష నేపథ్యంలో వాకర్స్‌కు పోలీస్ కమిషనర్ విజ్ఞప్తి



వరంగల్, 27 నవంబర్ 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)

తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టిఎస్ ఎల్.పి.ఆర్.బి) ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ ఆదివారం నిర్వహించనున్న ఎస్ఐ ప్రిలిమినరీ రాత పరీక్షల నేపథ్యంలో ట్రై సిటీ పరిధిలోని వాకర్స్‌కు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 32 పరీక్షా కేంద్రాల్లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎస్ఐ ప్రిలిమినరీ రాత పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణ, భద్రతా ఏర్పాట్ల దృష్ట్యా పరీక్షా కేంద్రాలుగా ఎంపికైన పాఠశాలలు, కళాశాలల మైదానాల్లో వాకింగ్‌కు తాత్కాలికంగా అనుమతి ఉండదని తెలిపారు. ఈ నెల 28వ తేదీ శనివారం సాయంత్రం 6 గంటల నుంచి 29వ తేదీ ఆదివారం ఉదయం వరకు సెయింట్ గాబ్రియేల్ హైస్కూల్ కాజీపేట, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల హనుమకొండ, కాకతీయ డిగ్రీ కళాశాల హనుమకొండ, కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్, లాల్ బహదూర్ కళాశాల వరంగల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వరంగల్ మైదానాల్లో వాకర్స్‌కు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సజావుగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ చేపడుతున్న భద్రతా చర్యలకు వాకర్స్‌తో పాటు ప్రజలందరూ సహకరించాలని పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత కోరారు.

వెట్టిచాకిరి, మానవ అక్రమ రవాణా నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలి: కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్, 27 నవంబర్ 2026(జై భీమ్ న్యూస్)

వెట్టిచాకిరిలో మగ్గుతున్న బాధితులను గుర్తించి వారికి రక్షణ కల్పించడంతో పాటు రాజ్యాంగం కల్పించిన హక్కులు అందేలా చూడటం ప్రభుత్వ అధికారుల బాధ్యత అని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో వెట్టిచాకిరి నిర్మూలన, మానవ అక్రమ రవాణా నివారణపై రెవెన్యూ, పోలీస్, కార్మిక, సంక్షేమ శాఖల అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ వెట్టిచాకిరి బాధితులకు తమ హక్కులు, చట్టపరమైన రక్షణ, సహాయం కోసం ఎవరిని సంప్రదించాలనే అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆధునిక సాంకేతిక యుగంలోనూ మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరి వ్యవస్థీకృత నేరాలుగా కొనసాగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు అధికారులు బాధితులను గుర్తించే విధానాలు, నేరాల నిర్వహణ తీరుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల పేరుతో జరిగే మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వెట్టిచాకిరికి పాల్పడేవారు బాధితులకు తెలిసినవారు, బంధువులు లేదా సన్నిహితులు కూడా అయి ఉండవచ్చని హెచ్చరించారు. బాధితులు తమ పరిస్థితిని తలరాతగా భావించకుండా రాజ్యాంగం కల్పించిన హక్కులను పొందుతూ గౌరవప్రదమైన స్వతంత్ర జీవనం సాగించేలా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సెంట్రల్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ దార కవిత మాట్లాడుతూ చిన్నారులు, మహిళలు, పెద్దలు సైతం పలుచోట్ల శ్రమదోపిడీకి గురవుతున్నారని, ఇతర రాష్ట్రాల నుంచి వ్యక్తులను తీసుకువచ్చి వెట్టిచాకిరి, బాల కార్మికులుగా పనుల్లో నియమిస్తున్న ఘటనలు ఉన్నాయని తెలిపారు. ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ ద్వారా వెట్టిచాకిరి, బాల కార్మిక వ్యవస్థలో చిక్కుకున్న పలువురు చిన్నారులను రక్షించినట్లు వివరించారు. ఉద్యోగాలు, ఉపాధి పేరుతో యువతులను ప్రలోభపెట్టి అక్రమంగా వ్యభిచారంలోకి నెట్టిన ఘటనలపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొంటూ, ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వెట్టిచాకిరి, మానవ అక్రమ రవాణా నిర్మూలనకు తహసీల్దార్లు, కార్మిక శాఖ అధికారులు, పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రానున్న రోజుల్లో అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో వెట్టిచాకిరి, మానవ అక్రమ రవాణా నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ, రిసోర్స్ పర్సన్ హైకోర్టు అడ్వకేట్ మేరకమని, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ డివిజన్ హెడ్ డాక్టర్ ఆనంద్, ఎఫ్ఎంఎం ప్రాజెక్టు కోఆర్డినేటర్లు బత్తుల కరుణ, ఎర్ర శ్రీకాంత్, ఇక్బాల్ భాష, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ భార్గవ్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సబ్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఇన్‌స్పెక్టర్ సుకూర్, తహసీల్దార్లు, కార్మిక శాఖ అధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఎన్జీవో ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోనూ.. కూటమే

ఒంగోలు, నవంబరు 27 (జై భీమ్ న్యూస్) :

పట్టణాల్లో కాకపోయినా, గ్రామీణ ప్రాంతాల్లో తమ పార్టీకి తిరుగులేని పట్టు ఉందని చెప్పుకునే వైసీపీ అసలు బలం ఇప్పుడు జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలతో బట్టబయలవుతోంది. ఇప్పటికే మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు,జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ఘోర పరాభవాన్ని చవిచూసిన వైసీపీ తాజాగా జరిగిన తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కనీసం 25 శాతం స్థానాలను కూడా దాటలేక చతికిలపడింది. ఏకగ్రీవమైన పంచాయతీల నుంచి పోలింగ్ జరిగిన స్థానాల వరకు దాదాపు అన్ని చోట్లా కూటమి మద్దతుదారులు, ముఖ్యంగా టీడీపీ బలపరిచిన అభ్యర్థులే ఏకపక్ష విజయాలను సొంతం చేసుకుంటున్నారు.నిజానికి గ్రామ పంచాయతీ ఎన్నికలు అధికారికంగా పార్టీల గుర్తులపై కాకుండా, పార్టీలకు అతీతంగా జరుగుతాయి. అయితే,క్షేత్రస్థాయిలో మాత్రం ప్రతి అభ్యర్థి వెనుక ఏదో ఒక ప్రధాన రాజకీయ పార్టీ అండదండలు ఉండటం సర్వసాధారణం. ముఖ్యంగా మండల కేంద్రాలు, పెద్ద జనాభా కలిగిన మేజర్ పంచాయతీల్లో అచ్చం అసెంబ్లీ ఎన్నికలను తలపించేలా పార్టీల పరంగానే హోరాహోరీ ప్రచారం నిర్వహిస్తారు. స్థానిక అంశాలు, కుల సమీకరణాలు కీలక పాత్ర పోషించినప్పటికీ, గ్రామాల్లో ప్రజలను ప్రభావితం చేయగల బలమైన నాయకత్వం ఏ పార్టీలో ఉందో ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.తొలి విడత ఎన్నికలు జరిగిన 3,949 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 750కి పైగా స్థానాలు ఏకగ్రీవం కాగా, అందులో సింహభాగం టీడీపీ మద్దతుదారుల ఖాతాలోనే చేరాయి. ఇక పోలింగ్ జరిగిన 3,200కు పైగా పంచాయతీల ఫలితాలను పరిశీలిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మేజర్ పంచాయతీల్లో కేవలం రెండు మూడు చోట్ల తప్ప, మిగిలిన మేజర్ పంచాయతీలన్నింటినీ టీడీపీ మద్దతుదారులే కైవసం చేసుకున్నారు. వైసీపీ కంచుకోటలుగా చెప్పుకునే రాయలసీమ జిల్లాల్లో సైతం ఆ పార్టీ మద్దతుదారులు గెలవడానికి తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. అయినా అరకొర ఫలితాలే వచ్చాయి.గ్రామీణ స్థాయిలో ఈ స్థాయి వైఫల్యానికి వైసీపీ అధినాయకత్వం అనుసరిస్తున్న తీరే ప్రధాన కారణమని భావిస్తున్నారు. ఒకవైపు అధినేత జగన్ మోహన్ రెడ్డి ఏపీలో కంటే బెంగళూరులోనే ఎక్కువ సమయం గడుపుతూ క్షేత్రస్థాయి క్యాడర్‌కు దూరంగా ఉండటం, మరోవైపు స్థానిక నేతలకు అండగా నిలిచే నాథుడు లేకపోవడంతో వైసీపీ శ్రేణుల్లో పూర్తిస్థాయి నైరాశ్యం అలుముకుంది. దీనికి తోడు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామాల్లో వేగవంతమైన మౌలిక సదుపాయాల కల్పన గ్రామీణ ఓటర్లను అధికార పక్షం వైపు మొగ్గు చూపేలా చేశాయి.మొత్తంగా చూస్తే, తొలి విడత పంచాయతీ ఫలితాలు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కూటమి ఆధిపత్యాన్ని మరోసారి రుజువు చేశాయి.

పనుల పురోగతి.. ఏడీబీ బ్యాంకు సంతృప్తి..

అమరావతి, నవంబరు 27 (జై భీమ్ న్యూస్) :

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పనులు అంతర్జాతీయ ఆర్థిక సంస్థల ప్రశంసలు అందుకుంటున్నాయి. రాజధాని ప్రాంతంలో పర్యటించిన ప్రపంచ బ్యాంకు , ఆసియా అభివృద్ధి బ్యాంకు ప్రతినిధుల బృందం అమరావతిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేసింది. ప్రాజెక్టుల అమలు తీరు, నిధుల వినియోగం, భవిష్యత్ కార్యాచరణపై సీఆర్డీఏ , ఏడీసీఎల్ ఉన్నతాధికారులతో బృందం సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించింది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రాజధాని నిర్మాణ ప్రక్రియ వేగంగా ముందుకు సాగుతుండటంపై ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు.క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ప్రపంచ బ్యాంకు, ఏడీబీ ప్రతినిధులు రాజధానిలోని పలు కీలక ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. వైకుంఠపురం పంపింగ్ స్టేషన్‌తో పాటు భవిష్యత్తులో రివర్‌ఫ్రంట్‌గా అభివృద్ధి చేయనున్న కృష్ణా నదీ తీర ప్రాంతాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. అలాగే, కృష్ణా కరకట్ట ఈ-1 రోడ్డు, మందడం పంచాయతీ పరిధిలో జరుగుతున్న మౌలిక సదుపాయాల పనులను, రాజధానికి అత్యంత కీలకమైన సీడ్ యాక్సిస్ ఈ-3 రహదారి రెండు,మూడు విడతల పనుల స్థితిగతులను నిశితంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.కేవలం నిర్మాణ పనుల వేగమే కాకుండా, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నిబంధనల ప్రకారం అమలవుతున్న సామాజిక,పర్యావరణ ప్రమాణాలపైనా బృందం ప్రత్యేక దృష్టి సారించింది. పనుల్లో పాల్గొంటున్న కార్మికుల భద్రత, పర్యావరణ పరిరక్షణ చర్యలు , సామాజిక భద్రతా ప్రమాణాలను ప్రతినిధులు తనిఖీ చేశారు. ముఖ్యంగా రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతుల ఫిర్యాదులు, వాటి పరిష్కారానికి సీఆర్డీఏ యంత్రాంగం చేపడుతున్న చర్యలపై ఆరా తీసి, స్థానిక రైతుల ప్రయోజనాలకు ఇస్తున్న ప్రాధాన్యతను అభినందించారు. ఈ పర్యటనలో భాగంగా నిధుల విడుదల ప్రక్రియ, తదుపరి దశ ప్రాజెక్టుల రోడ్‌మ్యాప్‌పై అధికారులతో స్పష్టమైన అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem
సామాన్యుడి ఆయుధంగా

కాకతీయ విశ్వవిద్యాలయ 24వ స్నాతకోత్సవం..

బంగారు పతకాలు, డాక్టరేట్ పట్టాల గ్రహీతలకు కీలక సూచనలు

హన్మకొండ, నవంబర్ 27 (జై భీమ్ న్యూస్)

కాకతీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నవంబర్ 28న నిర్వహించనున్న 24వ స్నాతకోత్సవానికి బంగారు పతకాలు, డాక్టరేట్ పట్టాలు అందుకోనున్న విద్యార్థులు నిర్దిష్ట సమయాల్లో హాజరుకావాలని విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ కట్ల సూచించారు. ఈ సందర్భంగా బంగారు పతకాలు అందుకోనున్న విద్యార్థులు నవంబర్ 28వ తేదీన ఉదయం 7 గంటల నుంచి 9 గంటల మధ్య దూరవిద్యా కేంద్రం ప్రధాన ద్వారం ద్వారా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలోకి ప్రవేశించి తమ బంగారు పతకాలను స్వీకరించాలని తెలిపారు. అనంతరం ఉదయం 9.20 గంటలలోపు సభా మందిరంలోకి ప్రవేశించి తమకు కేటాయించిన స్థానాల్లో కూర్చోవాలని సూచించారు. అదేవిధంగా డాక్టరేట్ పట్టాలు అందుకోనున్న పరిశోధక విద్యార్థులు కూడా దూరవిద్యా కేంద్రం ప్రధాన ద్వారం ద్వారానే సభా మందిరంలోకి ప్రవేశించాలని, ఉదయం 9 గంటలలోపు తమకు కేటాయించిన స్థానాల్లో ఆసీనులు కావాలని పేర్కొన్నారు. 24వ స్నాతకోత్సవ కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు విద్యార్థులు, పరిశోధకులు విశ్వవిద్యాలయం సూచించిన సమయపాలనను తప్పనిసరిగా పాటించాలని ఆచార్య రాజేందర్ కట్ల ఒక ప్రకటనలో కోరారు.

కాకతీయ విశ్వవిద్యాలయంలో మహాత్మా జ్యోతిరావు ఫూలే వర్ధంతి కార్యక్రమం

హన్మకొండ, నవంబర్ 27 (జై భీమ్ న్యూస్)

సామాజిక సంస్కర్త, బహుజన విద్యోద్యమ మార్గదర్శి మహాత్మా జ్యోతిరావు ఫూలే 136వ వర్ధంతి సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయంలో నవంబర్ 28వ తేదీ శనివారం ప్రత్యేక వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు కాకతీయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని దూరవిద్యా కేంద్రం వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావు ఫూలే విగ్రహం వద్ద ఈ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి, గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం హాజరుకానున్నారు. మహాత్మా జ్యోతిరావు ఫూలే ఆశయాలు, సమాజానికి ఆయన అందించిన సేవలను స్మరించుకుంటూ ఈ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీసీ సెల్ డైరెక్టర్, మహాత్మా జ్యోతిరావు ఫూలే పరిశోధన మరియు సామాజిక పరివర్తన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బోడిగె సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ బోడిగె సతీష్ కోరారు.

కాకతీయ యూనివర్సిటీ హాస్టళ్ల సమస్యలపై అధికారుల సమీక్ష.. డిసెంబర్ 4న మరోసారి సమావేశం

విద్యార్థులు, హాస్టల్ సిబ్బందితో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు



హన్మకొండ, 27 నవంబర్ 2026(జై భీమ్ న్యూస్)

కాకతీయ విశ్వవిద్యాలయంలోని హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు శుక్రవారం కాకతీయ విశ్వవిద్యాలయ కమిటీ హాల్‌లో హాస్టల్ సిబ్బంది, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవితో పాటు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ధారా కవిత, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పి. నరసింహారావు, ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సంబంధిత ఎస్ఐలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థులతో నేరుగా మాట్లాడి హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు, వసతి సౌకర్యాలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి సంఘాల నాయకులు, హాస్టల్ సిబ్బంది తమ అభిప్రాయాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులు ప్రస్తావించిన సమస్యలను సమగ్రంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా డిసెంబర్ 4వ తేదీన మరోసారి విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, హాస్టల్ డైరెక్టర్లు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సుమలత తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం అధికారులు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డిని కలిసి హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు, విద్యార్థులతో నిర్వహించిన చర్చలు, సమావేశంలో వెలువడిన అంశాలను వివరించారు.

అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను అందజేయాలి





పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి
హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
భీమదేవరపల్లి మండలం చంటయ్యపల్లి, కొత్తకొండ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రం, పల్లె దావఖాన, సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

భీమదేవరపల్లి, 27 నవంబర్ 2026(జై భీమ్ న్యూస్)

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలను అందజేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం భీమదేవరపల్లి మండలం చంటయ్యపల్లి, కొత్తకొండ గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రం, పల్లె దావఖాన, సీ సీ రోడ్లు, డ్రైనేజిలు, ఇతర అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చంటయ్యపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని, ప్రభుత్వ పాఠశాలను, గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రం భవనం, వీవో భవనం నిర్మాణానికి అనువైన స్థలాలు అందుబాటులో ఉంటే నిర్మాణాలకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాలని స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులకు సూచించారు. గ్రామపరిధిలోని తండాలోనూ జిల్లా కలెక్టర్ పర్యటించి స్థానిక పరిస్థితులను పరిశీలించారు. తండాలో నెలకొన్న విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఏఈని ఆదేశించారు. అనంతరం కొత్తకొండ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించిన జిల్లా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తెలుసుకునేందుకు పాఠ్యాంశాలను చదివించి పరిశీలించారు. విద్యార్థుల చదువుల పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం నాణ్యతగా విద్యార్థులకు అందించాలన్నారు. పల్లె దావఖానాను సందర్శించిఅక్కడ అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. మెరుగైన వైద్య సేవలను అందించాలని వైద్యులకు సూచించారు.

భూ రీసర్వే వేగవంతానికి చర్యలు చేపట్టాలి

మండలంలోని గ్రామాలలో చేపట్టిన భూ రీసర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తహసిల్దార్, ఇతర అధికారులను ఆదేశించారు. భీమదేవరపల్లి తహసిల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి భూముల రీ సర్వే ప్రక్రియ పురోగతిని, భూభారతి దరఖాస్తుల పరిష్కార చర్యలను పరిశీలించారు. భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చంటయ్యపల్లి, కొత్తకొండ గ్రామాల సర్పంచులు భూక్య సునీత, సిద్దమల్ల రమ, జెడ్పి డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావు , మండల ప్రత్యేక అధికారి కమలాకర్ రెడ్డి, తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, ఎంఈఓ శంకర్, పంచాయతీ రాజ్ డీఈ శిరీష, ఏఈ వినయ్ రెడ్డి, పలువురు వార్డు సభ్యులు, ఇతర అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

కాకతీయ యూనివర్సిటీ హాకి పురుషుల జట్టు ఎంపిక



హన్మకొండ, 27 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

చెన్నైలో నవంబర్ 28 నుంచి డిసెంబర్ 4 వరకు నిర్వహించనున్న 2026--27 దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల హాకీ (పురుషుల) టోర్నమెంట్‌లో పాల్గొనే కాకతీయ విశ్వవిద్యాలయ పురుషుల హాకీ జట్టును యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు ప్రకటించింది. చెన్నైలోని ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ టి. శాస్త్రి జట్టు వివరాలను వెల్లడించారు. జట్టుకు ఎంపికైన క్రీడాకారుల్లో వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ నుంచి భూక్య గణేష్, అవల్గాంకర్ కేదార్‌నాథ్, గడ్డి అజయ్ కుమార్, ఎస్. సంతోష్, పాత్రి వరుణ్ ఉన్నారు. ఆదిలాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి షేక్ సోహెల్ అబ్బాస్, కొడప ప్రదీప్, కొడప జంగు, ఎన్.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి పిల్లాల ఉమేష్, భూక్య భరత్ ఎంపికయ్యారు. కేయూ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ నుంచి వెట్టి భీమ్ రావు, వెట్టి జాకు, పట్నం నరేష్ జట్టులో స్థానం సంపాదించారు. అలాగే కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ నుంచి సయ్యద్ జునైద్ అహ్మద్, న్యూ సైన్స్ డిగ్రీ కళాశాల నుంచి అభినాష్ బొల్ల, ఆదిలాబాద్ టీజీటీడబ్ల్యూఆర్డీసీ నుంచి పెందూర్ నాగనాథ్, కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి సిడాం విజయ్ కుమార్, బజార్‌హత్నూర్ పద్మావతి డిగ్రీ కళాశాల నుంచి పెందూర్ కిరణ్ కుమార్ జట్టుకు ఎంపికయ్యారు. జట్టుకు వరంగల్ బొల్లికుంటలోని వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫిజికల్ డైరెక్టర్ సయ్యద్ యాసీన్ కోచ్‌గా, బోథ్ టీజీటీడబ్ల్యూఆర్డీసీ (ఎం) ఫిజికల్ డైరెక్టర్ కె. శ్రీనివాస్ మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. దక్షిణ భారత స్థాయి పోటీల్లో కాకతీయ విశ్వవిద్యాలయ జట్టు ప్రతిభ కనబరిచి విజయాలు సాధించాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

బాల్య వివాహాలు లేని జిల్లాగా వరంగల్‌ను తీర్చిదిద్దాలి

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలి
ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, కలెక్టర్ డా. సత్య శారద





వరంగల్, 27 నవంబర్ 2026(జై భీమ్ న్యూస్)

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రజాప్రతినిధులు, అధికారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యువత సమిష్టిగా కృషి చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డా. సత్య శారద పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లాను బాల్య వివాహాలు లేని జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని వారు సూచించారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, బాల రక్షా భవన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన “బాల వివాహ్ ముక్త్ భారత్” కార్యక్రమానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బాల్య వివాహాల కారణంగా చిన్నారుల భవిష్యత్తు దెబ్బతింటుందని అన్నారు. బాలికలు చిన్న వయసులోనే వివాహ బంధంలోకి వెళ్లకుండా ఉన్నత విద్యను అభ్యసించి, జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమ పిల్లల విద్యకు ప్రాధాన్యతనిస్తూ బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ, వివాహం చేసుకునే వారికి శారీరక, మానసిక పరిపక్వతతో పాటు కుటుంబ బాధ్యతలను స్వీకరించే సామర్థ్యం అవసరమని పేర్కొన్నారు. చిన్న వయసులో వివాహం చేయడం వల్ల పిల్లల ఆరోగ్యం, విద్య, మానసిక వికాసంపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. బాల్యంలోనే వివాహం చేయడం ద్వారా వారి బాల్యాన్ని, స్వేచ్ఛను, ఉజ్వల భవిష్యత్తును దూరం చేసినట్లవుతుందని అన్నారు. బాల్య వివాహం అనేది కేవలం ఒక కుటుంబానికి సంబంధించిన సమస్య కాదని, బాలల హక్కులు, విద్య, ఆరోగ్యం, సమాజ అభివృద్ధికి సంబంధించిన తీవ్రమైన సామాజిక సమస్య అని కలెక్టర్ వివరించారు. బాలికలు ఉన్నత విద్యను అభ్యసించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడంతోపాటు ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రోత్సహించాలని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతోపాటు గ్రామస్థాయిలో నిరంతర పర్యవేక్షణ అవసరమని తెలిపారు. అనంతరం వంచనగిరి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థినులు బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు, బాలికల విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రదర్శించిన నాటిక కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థినులు తమ ప్రదర్శన ద్వారా అందించిన సందేశం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. అలాగే షేర్ ఎన్జీవో ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనకు మద్దతుగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. బాల్య వివాహాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని ఈ కార్యక్రమం ద్వారా సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ కె. వసుధ, సభ్యురాలు షాహిదా బేగం, డీసీపీఓ కళ్యాణి, షేర్ ఎన్జీవో సిబ్బంది జన్ను ప్రభాకర్, కల్పన, ప్రశాంతి, బాల రక్షా భవన్ సిబ్బంది రాజుల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

రోహిత్‌కు డిప్యూటీగా ఉండాలన్న ముంబై ఇండియన్స్.. బుమ్రా నో చెప్పాడా?

ఐపీఎల్ 2027 సీజన్‌కు సంబంధించి ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీలో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. రోహిత్ శర్మను తిరిగి కెప్టెన్‌గా నియమించాలని ఫ్రాంచైజీ నిర్ణయించగా, అతనికి డిప్యూటీగా (వైస్ కెప్టెన్‌గా) వ్యవహరించాలంటూ వచ్చిన ఆఫర్‌ను స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఇండియా టుడే కథనం ప్రకారం... అక్టోబర్ మొదటి వారంలోనే ముంబై ఇండియన్స్ యాజమాన్యం బుమ్రాను సంప్రదించింది. రాబోయే 2027 ఐపీఎల్ సీజన్‌లో రోహిత్ శర్మకు వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాలని కోరింది. అయితే ఈ ప్రతిపాదనను బుమ్రా మర్యాదపూర్వకంగా తిరస్కరించారు. ఆయన ఈ నిర్ణయం తీసుకోవడానికి గల నిర్దిష్ట కారణాలు మాత్రం వెల్లడి కాలేదు. ప్రస్తుతం ముంబై ఇండియన్స్ జట్టుకు శాశ్వత వైస్ కెప్టెన్ ఎవరూ లేరు. గతంలో హార్దిక్ పాండ్యా అందుబాటులో లేని సమయాల్లో బుమ్రా, సూర్యకుమార్ యాదవ్ నాయకత్వ బాధ్యతలను పంచుకున్నారు. అయితే రాబోయే సీజన్ కోసం రోహిత్ చుట్టూనే నాయకత్వ విభాగాన్ని బలోపేతం చేయాలని ఫ్రాంచైజీ భావిస్తోంది. ఈ క్రమంలోనే బుమ్రాకు డిప్యూటీ పదవిని ఆఫర్ చేసినట్లు సమాచారం. జట్టులోని ప్రధాన ఆటగాళ్లలో ఒకరైన బుమ్రా వైస్ కెప్టెన్సీని వద్దనుకోవడం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. భారత జట్టు ప్రధాన పేసర్‌గా ఇప్పటికే ఎంతో అనుభవం ఉన్న బుమ్రా, అదనపు బాధ్యతల కంటే తన బౌలింగ్‌పైనే పూర్తి దృష్టి పెట్టాలని భావిస్తున్నారా? అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, ఈ నిర్ణయం 2028 మెగా వేలానికి ముందు ముంబై ఇండియన్స్‌తో బుమ్రా అనుబంధంపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి.

ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షకు పటిష్ట పోలీస్ బందోబస్తు

వరంగల్ కమిషనరేట్ పరిధిలో 32 పరీక్షా కేంద్రాలు.. 18,194 మంది అభ్యర్థులు
ఆరు రూట్లుగా విభజన.. ప్రతి రూట్‌కు ఏసీపీ స్థాయి అధికారి పర్యవేక్షణ
పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 500 మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు

వరంగల్, 27 నవంబర్ 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)

తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్న సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) ప్రిలిమినరీ రాత పరీక్షకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ తెలిపారు. పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 32 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, పరీక్షల నిర్వహణ, భద్రతా పర్యవేక్షణ కోసం వాటిని ఆరు రూట్లుగా విభజించారు. ప్రతి రూట్‌కు ఏసీపీ స్థాయి అధికారిని నియమించి బందోబస్తును పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నారు. ఈ పరీక్షకు వరంగల్ రీజియన్ పరిధిలో మొత్తం 18,194 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఈ నెల 29వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నారు. అభ్యర్థులకు బయోమెట్రిక్ నమోదు ఉండటంతో ఉదయం 9 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఉదయం 10 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. అభ్యర్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో



డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్‌పై పాస్‌పోర్ట్ సైజు ఫొటో అతికించుకుని తీసుకురావాలి. పరీక్షకు బాల్‌పాయింట్ పెన్నులు మాత్రమే తీసుకురావాలి. బయోమెట్రిక్ నమోదు సజావుగా జరిగేందుకు చేతులపై ఎలాంటి గుర్తులు ఉండకూడదు. పరీక్ష పూర్తయ్యే వరకు ఏ అభ్యర్థినీ పరీక్షా కేంద్రం నుంచి బయటకు వెళ్లేందుకు అనుమతించరు. పరీక్ష అనంతరం ఓఎంఆర్ షీట్లను ఇన్విజిలేటర్లకు మాత్రమే అప్పగించాలి. హాల్‌టికెట్‌పై ముద్రించిన నియమ నిబంధనలను అభ్యర్థులు తప్పనిసరిగా చదివి పాటించాలని సూచించారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు, వాచీలు, కాలిక్యులేటర్లు, డిజిటల్ కళ్లద్దాలు, బంగారు ఆభరణాలు, పర్సులు, వాటర్ బాటిళ్లు తదితర వస్తువులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరు. పరీక్షా కేంద్రాల వద్ద వస్తువులను భద్రపరచడానికి ఎలాంటి క్లోక్ రూమ్ సదుపాయం ఉండదని, అభ్యర్థులు నిషేధిత వస్తువులను వెంట తీసుకురావద్దని పోలీసులు స్పష్టం చేశారు. పరీక్షల నేపథ్యంలో హనుమకొండ, వరంగల్, కాజీపేట ప్రాంతాల్లోని పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 500 మీటర్ల పరిధిలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బిఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 ప్రకారం నిషేధాజ్ఞలు విధిస్తూ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆంక్షలు నవంబర్ 29వ తేదీ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అమలులో ఉంటాయి. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడడం, సమావేశాలు నిర్వహించడం నిషేధించారు. అలాగే పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను పరీక్షల సమయంలో మూసివేయాలని, 500 మీటర్ల పరిధిలో లౌడ్ స్పీకర్లు, మైకులు వినియోగించరాదని ఆదేశించారు. డ్రోన్లు ఎగురవేయడానికి అనుమతి లేదని, అభ్యర్థుల బంధువులు, ఇతరులు పరీక్షా కేంద్రాల వద్దకు రావద్దని సూచించారు. విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సైనిక సిబ్బంది, హోంగార్డులు, అంత్యక్రియల నిమిత్తం నిర్వహించే నిజమైన అంతిమయాత్రలకు ఈ ఆంక్షల నుంచి మినహాయింపు ఉంటుంది. ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనరేట్ హెచ్చరించింది. ఇదిలా ఉండగా, పరీక్షల నిర్వహణ నేపథ్యంలో కాజీపేటలోని సెయింట్ గాబ్రియేల్ హైస్కూల్, హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కాకతీయ డిగ్రీ కళాశాల, కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్, వరంగల్‌లోని లాల్ బహదూర్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పరిసరాల్లో శనివారం సాయంత్రం 6 గంటల నుంచి, ఆదివారం ఉదయం కూడా వాకర్స్‌కు అనుమతి ఉండదని పోలీసులు తెలిపారు. ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అభ్యర్థులు సమయపాలన పాటించాలని, హాల్‌టికెట్‌పై సూచించిన నిబంధనలను తప్పనిసరిగా అనుసరించాలని పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత కోరారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అభ్యర్థులు, తల్లిదండ్రులు, ప్రజలు పోలీస్ శాఖకు, పరీక్షా సిబ్బందికి పూర్తిస్థాయిలో సహకరించాలని వరంగల్ పోలీస్ కమిషనరేట్ విజ్ఞప్తి చేసింది.

ములుగు ప్రభుత్వ వైద్య కళాశాలలో 24 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

23 సహాయ ఆచార్యులు, ఒక బోధనా సహాయకుడి పోస్టుల భర్తీ
నవంబర్ 30 నుంచి డిసెంబర్ 5 వరకు దరఖాస్తుల స్వీకరణ.. డిసెంబర్ 11న ముఖాముఖి ఎంపిక

ములుగు, 27 నవంబర్ 2026(జై భీమ్ న్యూస్)

ములుగు ప్రభుత్వ వైద్య కళాశాల, అనుబంధ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న 24 ఉద్యోగాలను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కళాశాల ప్రధానాచార్యురాలు స్వర్ణ కుమారి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో నియామక వివరాలను వెల్లడించారు. కళాశాలలోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 23 సహాయ ఆచార్యుల పోస్టులతో పాటు ఒక బోధనా సహాయకుడి పోస్టును భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈ నియామక ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు 2027 మార్చి 31వ తేదీ వరకు లేదా అవసరం ఉన్నంత వరకు, ఏది ముందైతే అప్పటివరకు ఒప్పంద ప్రాతిపదికన విధులు నిర్వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ఉద్యోగాలకు అర్హత కలిగిన అభ్యర్థులు నవంబర్ 30వ తేదీ ఉదయం 11 గంటల నుంచి డిసెంబర్ 5వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు ములుగు ప్రభుత్వ వైద్య కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. డిసెంబర్ 11వ తేదీన కళాశాల ప్రాంగణంలో ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఉద్యోగాలకు సంబంధించిన విద్యార్హతలు, నియామక నిబంధనలు, దరఖాస్తు పత్రం తదితర పూర్తి వివరాలను కళాశాల అధికారిక వెబ్‌సైట్ స్ట్రజూం://స్త్రఎఎఎబశ్రీబస్త్రబ.శీతీస్త్ర ద్వారా తెలుసుకోవచ్చని వెల్లడించారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రధానాచార్యురాలు స్వర్ణ కుమారి కోరారు.

కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్షతో 240 కిలోమీటర్ల పాదయాత్ర

ఐదు రోజుల పాటు పాదయాత్ర చేసి ఎర్రవెల్లికి చేరుకున్న బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తిరుపతయ్య.. కేసీఆర్‌ను కలిసి ఆశీస్సులు



హైద్రాబాద్, 27 నవంబర్ 2026(జై భీమ్ న్యూస్)

తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గండు తిరుపతయ్య చేపట్టిన పాదయాత్ర శుక్రవారం ముగిసింది. ఐదు రోజుల పాటు సుమారు 240 కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించి ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి చేరుకున్న ఆయన, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట్ మండలం దయపంతులపల్లి గ్రామానికి చెందిన గండు తిరుపతయ్య గ్రామ బీఆర్ఎస్ శాఖ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఐదు రోజుల క్రితం ఫత్తేపురం మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే సంకల్పంతో పాదయాత్ర ప్రారంభించారు. ఐదు రోజుల పాటు 240 కిలోమీటర్లు నడిచి శుక్రవారం ఎర్రవెల్లికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ తిరుపతయ్యను ఆప్యాయంగా పలకరించి, పాదయాత్రకు సంబంధించిన వివరాలతో పాటు ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తన అభిమానాన్ని, కేసీఆర్‌పై ఉన్న విశ్వాసాన్ని తిరుపతయ్య ఈ సందర్భంగా వ్యక్తం చేశారు. రైతుబంధు సాయం అందడం లేదని, సాగునీరు, విద్యుత్ సౌకర్యాలు సరిగా లేకపోవడంతో తనకున్న మూడు ఎకరాల పొలం ఎండిపోయిందని తిరుపతయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, రైతులకు మేలు జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కేసీఆర్‌పై ఉన్న అభిమానంతో ఐదు రోజుల పాటు 240 కిలోమీటర్లు పాదయాత్ర చేసి ఎర్రవెల్లికి చేరుకోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

గ్రేటర్ వరంగల్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయి



హన్మకొండ, 27 నవంబర్ 2026(జై భీమ్ న్యూస్)

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను నిర్దేశిత ప్రణాళిక ప్రకారం త్వరితగతిన పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మున్సిపల్ కమిషనర్ వెంకన్నతో కలిసి వివిధ విభాగాలకు చెందిన ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో జంక్షన్ల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే పనులు ప్రారంభమైన ప్రాంతాల్లో వాటిని మరింత వేగవంతం చేసి పూర్తి చేయాలని, ఇంకా ప్రారంభం కాని ప్రాంతాల్లో వెంటనే పనులు మొదలుపెట్టాలని ఆదేశించారు. అభివృద్ధి పనులన్నీ తగిన ప్రణాళికతో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వడ్డేపల్లి బండ్ అభివృద్ధి పనులతో పాటు ప్లానిటోరియం అభివృద్ధి పనులను కూడా వేగవంతం చేయాలని సూచించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, నగరంలో చేపట్టనున్న రోడ్లు, విద్యుత్, సుందరీకరణ తదితర అభివృద్ధి పనులకు సంబంధించి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా నగరంలోని స్మశాన వాటికల్లో చేపట్టిన అభివృద్ధి పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈలు రవికుమార్, సంజయ్, డీఈలు, ఏఈలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: ఆకుల రాజేందర్

హన్మకొండ, 27 నవంబర్ 2026(జై భీమ్ న్యూస్)





ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో పనిచేస్తూ టీఎన్జీవోస్ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని జిల్లా జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం అలంకార్ జంక్షన్‌లోని టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహించిన సిటీ యూనిట్ కార్యవర్గ ఎన్నికల కార్యక్రమానికి ఆయనతో పాటు జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆకుల రాజేందర్ మాట్లాడుతూ కేంద్ర సంఘం పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సంఘం కృషి చేస్తోందన్నారు. కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేనీ నాయకత్వంలో ఉద్యోగుల పెండింగ్ సమస్యలన్నీ త్వరలో పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పీఆర్సీ అమలు, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ సాధన కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మండల స్థాయిలో సంఘాన్ని బలోపేతం చేయడంతో పాటు ఉద్యోగులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సభ్యత్వ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని, ఉద్యోగుల సంక్షేమం కోసం నూతన కార్యవర్గం బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఎన్నికల అధికారిగా జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్ వ్యవహరించగా, సిటీ యూనిట్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా సాంబరాజు ప్రణయ్ కుమార్, కార్యదర్శిగా ఎం. పృథ్వీరాజ్, కోశాధికారిగా ఎ. సుధాకర్, ఉపాధ్యక్షులుగా ప్రణీత్ కుమార్, బి. ప్రవీణ్ కుమార్, కల్పన, నిఖిల్ రాజ్, హ్యాపీ గ్రేస్, సంయుక్త కార్యదర్శులుగా వంశీ, రామస్వామి, ప్రచార కార్యదర్శులుగా మమత, ఎం.డి. ఫరీదున్నీసా, ప్రావళిక, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ప్రీతి, భరత్, కార్యాలయ కార్యదర్శులుగా శ్రవణ్ కుమార్, నవీన్, కార్యవర్గ సభ్యులుగా జె. భవాని, మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికల రాజేష్, గౌరవ అధ్యక్షుడు శ్యాంసుందర్, కేంద్ర సంఘం నాయకులు రాము నాయక్, మొయిజ్, జిల్లా నాయకులు రమేష్, సలీం, రాజమౌళి, రాజేష్ ఖన్నా, రామ్ ప్రసాద్, భగవాన్ రెడ్డి, కళకోట్ల భరత్, ఉదయ్ భాస్కర్, రాజీవ్, మెహబూబ్, వెంకన్న, అశోక్, రమేష్, హమీద్, అహ్మద్ రాజా తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న కొండా సురేఖ-మురళీధర్ దంపతులు

వరంగల్, 27 నవంబర్ 2026(జై భీమ్ న్యూస్)



వరంగల్ మహానగరంలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ దంపతులు శుక్రవారం ఉదయం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన కొండా దంపతులకు ఆలయ ధర్మకర్తలు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొండా దంపతులు భద్రకాళి అమ్మవారికి చీర సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మహామండపంలో అర్చకులు, వేదపండితులు వారికి వేదమంత్రోచ్ఛారణల మధ్య మహదాశీర్వచనం అందజేశారు. అమ్మవారి శేషవస్త్రాలను బహూకరించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్, కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్, దేవస్థాన మాజీ ధర్మకర్త తొగరు క్రాంతితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

ఎస్సీ మహిళా విద్యార్థినుల హాస్టల్ సమస్య పరిష్కరించాలని జై భీమ్ టీవీకి విద్యార్థినుల వినతి

నల్లకుంట హాస్టల్‌లో ఉంటూ చదువుకోలేకపోతున్నాం..
కోచింగ్ సెంటర్లు దిల్‌సుఖ్‌నగర్‌లోనే ఉన్నాయి.. అక్కడే హాస్టల్ వసతి కల్పించాలి
విద్యార్థినుల సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన డాక్టర్ బరిగెల శివ - త్వరలో పరిష్కరిస్తామని హామీ



హైదరాబాద్, 27 నవంబర్ 2026(జై భీమ్ న్యూస్)

షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్సీ మహిళా విద్యార్థినుల హాస్టల్ సమస్యలను పరిష్కరించి, తమకు దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలోనే హాస్టల్ వసతి కల్పించాలని విద్యార్థినులు డిమాండ్ చేశారు. ప్రస్తుతం నల్లకుంటలోని హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినులు అక్కడి పరిస్థితుల కారణంగా చదువుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న తమకు అవసరమైన కోచింగ్ సెంటర్లు, శిక్షణా సంస్థలు ఎక్కువగా దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలోనే ఉన్నాయని, నల్లకుంట నుంచి ప్రతిరోజూ ప్రయాణించడం వల్ల సమయం వృథా అవుతోందని తెలిపారు. దీనివల్ల చదువుపై ఏకాగ్రత దెబ్బతింటోందని పేర్కొన్నారు. తమ విద్యాభవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని దిల్‌సుఖ్‌నగర్ సమీపంలోని భవనాల్లోనే హాస్టల్ సౌకర్యం కల్పించాలని, అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరుతూ విద్యార్థినులు జై భీమ్ టీవీ కార్యాలయానికి చేరుకుని జై భీమ్ సంస్థల ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ బరిగెల శివకు వినతిపత్రం అందజేశారు. విద్యార్థినుల సమస్యలను విన్న డాక్టర్ బరిగెల శివ తక్షణమే స్పందించి, ఈ విషయాన్ని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థినుల విద్యకు ఆటంకం కలగకుండా, వారి అభ్యర్థనను పరిశీలించి తగిన న్యాయం చేయాలని కోరారు. విద్యార్థినుల విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించి, సమస్యను పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. పేద విద్యార్థినులు ఉన్నత చదువులు చదివి పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే వారికి నాణ్యమైన విద్యతో పాటు అనుకూలమైన వసతి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం అత్యంత ముఖ్యం. విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డాక్టర్ బరిగెల శివ కోరారు.

వెంకట్ రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

అధ్యక్షుడిగా ముషిగంపల శివ గౌడ్..
ప్రధాన కార్యదర్శులుగా అద్దంకి యాకాంత రావు, పూజారి సోమయ్య ఎన్నిక



ఉప్పల్, నవంబర్ 27(జై భీమ్ న్యూస్)



వెంకట్ రెడ్డి నగర్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం సామరస్యపూర్వక వాతావరణంలో ఏకగ్రీవంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో అసోసియేషన్ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ముషిగంపల శివ గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా పిసరి శంకర్, ప్రధాన కార్యదర్శులుగా అద్దంకి యాకాంత రావు, పూజారి సోమయ్య, కోశాధికారిగా ఆవుల సుధాకర్, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు కాలనీ వాసులు అభినందనలు తెలిపారు. కాలనీ సమగ్ర అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. కాలనీలో ఐక్యతను కాపాడుతూ ప్రతి ఒక్కరినీ కలుపుకొని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించిన కోర్ కమిటీ కన్వీనర్ బుచ్చిరెడ్డికి, కోర్ కమిటీ సభ్యులు వేములకొండ సోమశేఖర్ గౌడ్, బిల్లకంటి యాదయ్య, శంకరయ్య గౌడ్, మహాదేవబట్ల లక్ష్మణ్ ప్రసాద్ శర్మ, వేములకొండ వెంకన్న గౌడ్, హేండిగా లక్ష్మయ్య, ఆకారపు అరుణ్ పటేల్‌కు అసోసియేషన్ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో కాలనీ పెద్దలు, అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్నికలు ఏకగ్రీవంగా జరగడంతో కాలనీలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

హాసన్‌పర్తి ప్రభుత్వ కార్యాలయాల్లో అపరిశుభ్రత తాండవం.. పాముల స్వైర విహారం!





కార్యాలయాల చుట్టూ పేరుకుపోయిన చెత్తాచెదారం.. పిచ్చిమొక్కలతో నిండిన పరిసరాలు
కార్యాలయాల ఆవరణలోనే కాకుండా లోపలికి సైతం ప్రవేశిస్తున్న విషసర్పాలు.. ప్రజలు, రైతుల్లో తీవ్ర భయాందోళన
పారిశుధ్య నిర్వహణను గాలికొదిలేసిన అధికారులు.. ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది అంటూ ప్రజల నిలదీత

హాసన్‌పర్తి, 27 నవంబర్ 2026(జై భీమ్ న్యూస్)

ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించాల్సిన ప్రభుత్వ కార్యాలయాలే అపరిశుభ్రతకు నిలయాలుగా మారుతున్నాయి. మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయాల చుట్టూ ఎక్కడ చూసినా చెత్తాచెదారం పేరుకుపోవడం, పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడం, పరిసరాలు దుర్వాసన వెదజల్లడం వంటి పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి తోడు కార్యాలయాల ఆవరణలోనే కాకుండా భవనాల లోపలికి సైతం పాములు ప్రవేశిస్తూ సంచరిస్తుండటంతో కార్యాలయాలకు వచ్చే ప్రజలు, ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు. హాసన్‌పర్తి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయం, వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం, విద్యాశాఖ అధికారి కార్యాలయం, పోలీస్ స్టేషన్ తదితర ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు పరిశుభ్రతకు దూరంగా కనిపిస్తున్నాయి. ప్రజలకు నిత్యం అవసరమైన సేవలు అందించే ఈ కార్యాలయాల వద్ద కనీస పారిశుధ్య చర్యలు కూడా సక్రమంగా అమలవుతున్నట్లు కనిపించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. కార్యాలయాల ప్రాంగణాల్లో చెత్త కుప్పలుగా పేరుకుపోవడంతో పాటు పిచ్చిమొక్కలు, పొదలు పెరిగి పరిసరాలు అస్తవ్యస్తంగా మారాయి. రోజురోజుకు ఈ పరిస్థితి మరింత అధ్వానంగా మారుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కార్యాలయాల పరిసరాల్లో పాముల సంచారం స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. చెత్తాచెదారం, పొదలు, పిచ్చిమొక్కలు ఎక్కువగా ఉండటంతో విషసర్పాలకు అనువైన ఆవాసాలుగా మారుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాములు కార్యాలయాల ఆవరణలోనే కాకుండా భవనాల లోపలికి కూడా ప్రవేశిస్తున్నాయని, తరచూ కనిపిస్తుండటంతో ఉద్యోగులు సైతం అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం ప్రతిరోజూ వచ్చే రైతులు, మహిళలు, వృద్ధులు, సామాన్య ప్రజలు పాముల భయంతో కార్యాలయాల్లోకి వెళ్లేందుకు కూడా ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు ప్రజలకు పరిశుభ్రత, పరిసరాల పరిరక్షణ, ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించాల్సిన ప్రభుత్వ శాఖలే తమ కార్యాలయాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోలేని పరిస్థితి నెలకొనడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణలో పారిశుధ్యం కూడా ఒక ముఖ్యమైన బాధ్యత అయినప్పటికీ, కార్యాలయాల చుట్టూ పేరుకుపోయిన చెత్తను తొలగించడం, పిచ్చిమొక్కలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించడం, పాములు ప్రవేశించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో నిర్లక్ష్యం కనిపిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కార్యాలయాలకు వచ్చే ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని కనీస చర్యలు చేపట్టకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలంటే ప్రజలకు నమ్మకం కలిగించేలా, పరిశుభ్రమైన వాతావరణంతో ఉండాల్సిన అవసరం ఉందని, కానీ హాసన్‌పర్తిలో అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. తమ కార్యాలయాల పరిసరాలనే పరిశుభ్రంగా ఉంచుకోలేని అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంపై ఎంత శ్రద్ధ చూపుతున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కార్యాలయాల్లో పారిశుధ్య నిర్వహణను నిర్లక్ష్యం చేయడం వల్ల దోమలు, విషపురుగులు, పాముల సంచారం పెరిగే ప్రమాదం ఉందని, దీనివల్ల ప్రజలతో పాటు అక్కడ విధులు నిర్వహించే ఉద్యోగుల ఆరోగ్యం, ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఏదైనా అత్యవసర పనిపై కార్యాలయాలకు వచ్చే వృద్ధులు, చిన్నపిల్లలతో వచ్చే మహిళలు, రైతులు అనుకోకుండా పాముల బారిన పడితే పరిస్థితి ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పాము కాటు వంటి ప్రమాదం చోటుచేసుకున్న తర్వాత స్పందించడం కంటే ముందుగానే నివారణ చర్యలు చేపట్టడం అధికారుల బాధ్యత కాదా అని నిలదీస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలు ప్రజలకు భద్రత కల్పించేలా ఉండాలి తప్ప భయాందోళనలకు గురిచేసేలా ఉండకూడదని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా మండల స్థాయి ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులు స్పందించి ఎంపీడీవో, తహసిల్దార్, వ్యవసాయ, విద్యాశాఖ కార్యాలయాలతో పాటు పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించి, పిచ్చిమొక్కలు, పొదలను పూర్తిస్థాయిలో శుభ్రం చేయించాలని కోరుతున్నారు. అవసరమైన చోట పాముల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు కార్యాలయ భవనాల్లోకి విషసర్పాలు ప్రవేశించకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అంతేకాకుండా ఒక్కసారి శుభ్రం చేసి వదిలేయకుండా ప్రతి కార్యాలయంలో నిరంతర పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక బాధ్యతలు కేటాయించాలని, కార్యాలయాల పరిసరాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచిస్తున్నారు. ప్రజలకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన, సురక్షితమైన వాతావరణంలో ప్రభుత్వ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. హాసన్‌పర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల దుస్థితిపై ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందిస్తారా? చెత్తాచెదారం తొలగించి పాముల సంచారాన్ని అరికట్టేందుకు చర్యలు చేపడతారా? లేక ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాతే మేల్కొంటారా? అన్నది ప్రస్తుతం మండల ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

కమలాపూర్‌లో వెట్టి చాకిరీకి గురైన 8 కార్మిక కుటుంబాలకు విముక్తి

కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ప్రత్యేక చొరవతో స్వగ్రామాలకు తరలింపు.. బాధితులకు విముక్తి ధ్రువీకరణ పత్రాలు అందజేత
మరోసారి ఇలాంటి మోసాలకు గురికావద్దు.. పిల్లలను చదివించి మంచి భవిష్యత్తును అందించాలి: కలెక్టర్

హన్మకొండ జిల్లా/కమలాపూర్, 27 నవంబర్ 2026(జై భీమ్ న్యూస్)

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో వెట్టి చాకిరీకి గురవుతున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎనిమిది కార్మిక కుటుంబాలకు విముక్తి లభించింది. ఉపాధి కోసం స్వగ్రామాలను విడిచిపెట్టి వందల కిలోమీటర్ల దూరం వలస వచ్చిన ఈ కుటుంబాలు, మెరుగైన జీవితం కోసం ఆశపడి ఇటుకల తయారీ కేంద్రంలో పనికి చేరాయి. అయితే సంబంధిత యజమాని చేతిలో ఏళ్ల తరబడి మోసపోతూ, అరకొర కూలీతో వెట్టి చాకిరీ చేస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. ఈ విషయం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి దృష్టికి రావడంతో ఆమె ప్రత్యేక చొరవ తీసుకుని బాధిత కుటుంబాలకు విముక్తి కల్పించేలా చర్యలు చేపట్టారు. వెట్టి చాకిరీ కార్మికుల సమాచారం అందిన వెంటనే కలెక్టర్ అధికారులను అప్రమత్తం చేసి, బాధితులు పనిచేస్తున్న ప్రాంతానికి హుటాహుటిన వెళ్లి విచారణ చేపట్టాలని ఆదేశించారు. మండల స్థాయి బృందం క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సమర్పించిన నివేదిక ఆధారంగా బాధితులను వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించే చర్యలు చేపట్టారు. అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌కు తీసుకువచ్చిన బాధిత కార్మిక కుటుంబాలతో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పేదరికం, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కార్మికులను ఇబ్బందులకు గురిచేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మరోసారి ఇలాంటి వ్యక్తులను నమ్మి మోసపోవద్దని, ఎక్కడైనా వెట్టి చాకిరీకి గురిచేసే పనుల్లో చేరవద్దని సూచించారు. స్వేచ్ఛగా పనిచేసుకుంటూ గౌరవప్రదమైన జీవనం సాగించాలని, పిల్లల భవిష్యత్తు బాగుండేలా వారిని తప్పనిసరిగా చదివించాలని కోరారు. మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉండి కుటుంబ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. వెట్టి చాకిరీ అనేది చట్టవిరుద్ధమైన చర్య అని, కార్మికుల హక్కులను హరించే ఇటువంటి వ్యవహారాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని కలెక్టర్ పేర్కొన్నారు. కార్మికులను వెట్టి చాకిరీ చేయిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రం యజమాని శివకుమార్‌పై చట్టప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని హనుమకొండ ఆర్డీవో వెంకటేష్‌ను ఆదేశించారు. అదేవిధంగా కార్మికులు పనిచేసిన రోజులకు సంబంధించిన కూలీ డబ్బులు చట్టప్రకారం అందేలా చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖ అధికారులకు సూచించారు. మండల స్థాయి బృందం నివేదిక, క్షేత్రస్థాయి విచారణ అనంతరం ఆర్డీవో జారీ చేసిన వెట్టి చాకిరీ విముక్తి ధ్రువీకరణ పత్రాలను జిల్లా కలెక్టర్ బాధిత కార్మికులకు అందజేశారు. అనంతరం వారు తమ స్వగ్రామాలైన ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు సురక్షితంగా చేరుకునేందుకు ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేయించారు. ప్రయాణ సమయంలో ఇబ్బందులు కలగకుండా భోజనం, పిల్లలకు పాలు, ఇతర అవసరమైన సదుపాయాలను అధికారులు కల్పించారు. ఈ విషయమై శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్‌తో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఫోన్‌లో మాట్లాడి బాధిత కార్మిక కుటుంబాలను ప్రత్యేక వాహనంలో స్వగ్రామాలకు పంపిస్తున్నట్లు సమాచారం అందించారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో వెట్టి చాకిరీ నుంచి విముక్తి లభించడంతో పాటు స్వగ్రామాలకు వెళ్లేందుకు ప్రయాణ ఏర్పాట్లు చేయడంపై బాధిత కార్మికులు, వారి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. తమకు విముక్తి కల్పించి, స్వగ్రామాలకు పంపేందుకు ఏర్పాట్లు చేసిన కలెక్టర్‌తో పాటు సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ రవి, ఆర్డీవో వెంకటేష్, కమలాపూర్ తహసీల్దార్ సురేష్ కుమార్, సహాయ కార్మిక అధికారి షర్ఫుద్దీన్, ఆర్ఐ ఫాజిల్, సూపర్ వైజర్ స్వరూప, ఇతర అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



వ్యవసాయం నుంచి పారిశ్రామిక రంగం వరకు ప్రత్యేక కార్యాచరణ

నిధులు కేటాయించినంత మాత్రాన అభివృద్ధి జరిగినట్లు కాదు.. అర్హులకు ప్రతి రూపాయి చేరాలి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

రూ.242 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

విద్యార్థుల ఉపకార వేతనాలు, గురుకులాల అభివృద్ధికి ప్రాధాన్యం

వారం రోజుల్లో కార్యాచరణ ప్రణాళికలు సమర్పించాలని అధికారులకు ఆదేశం

హైదరాబాద్, 27 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్) :

రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అభ్యున్నతికి కేవలం సంక్షేమ పథకాల అమలుకే పరిమితం కాకుండా, ఆయా వర్గాల కుటుంబాలకు శాశ్వత ఆదాయ మార్గాలు కల్పించి ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయం నుంచి పశుసంవర్ధక, మత్స్య, పారిశ్రామిక, ఆధునిక సేవారంగాల వరకు ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధుల వినియోగం, శాఖలవారీగా అమలవుతున్న పథకాలు, పెండింగ్ ప్రతిపాదనలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్వహించిన 2026--27 ఆర్థిక సంవత్సర నోడల్ ఏజెన్సీ సమీక్షా సమావేశంలో మంత్రి విస్తృతంగా సమీక్షించారు. ఈ సమావేశంలో వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య, నీటిపారుదల, రవాణా, రోడ్లు--భవనాలు, ప్రణాళిక, గృహ నిర్మాణం, ఇంధనం, పౌరసరఫరాలు, పరిశ్రమలు--వాణిజ్యం, మాధ్యమిక విద్య, ఉన్నత విద్య, వైద్య ఆరోగ్యం, మహిళా--శిశు సంక్షేమం, కార్మిక--ఉపాధి, పురపాలక--పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్--గ్రామీణాభివృద్ధి, ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కేటాయించిన నిధులు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించాలని అన్నారు. నిధుల కేటాయింపులు జరిగినప్పటికీ వాటిని ఖర్చు చేయకుండా మిగిలిపోవడం సరైన విధానం కాదని, ప్రతి శాఖ తనకు కేటాయించిన నిధులను సమర్థవంతంగా వినియోగించి అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చాలని సూచించారు. నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటిస్తూ స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆదేశించారు. సంక్షేమం అంటే కేవలం ఆర్థిక సహాయం అందించడం మాత్రమే కాదని, పేద కుటుంబాలకు శాశ్వత ఆదాయ వనరులు, ఉత్పాదక ఆస్తులు, నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించినప్పుడే నిజమైన సాధికారత సాధ్యమవుతుందని మంత్రి స్పష్టం చేశారు. ఎన్ని కుటుంబాలు పథకాల ద్వారా లబ్ధి పొందాయి? ఎంతమందికి స్వయం ఉపాధి లభించింది? కుటుంబాల ఆదాయం ఎంత పెరిగింది? ఎంతమంది ఆర్థికంగా నిలదొక్కుకున్నారు? అనే అంశాల ఆధారంగా పథకాల ఫలితాలను అంచనా వేయాలని అధికారులకు సూచించారు.

వ్యవసాయ రంగంలో ప్రత్యేక కార్యాచరణ

ఎస్సీ రైతులకు నాణ్యమైన విత్తనాలు, బిందు సేద్యం, తుంపర సేద్యం, వ్యవసాయ యంత్ర పరికరాలు, సౌర విద్యుత్ కంచెలు, ప్రత్యామ్నాయ పంటల సాగు, పట్టు పరిశ్రమ, శిక్షణ, వ్యక్తిగత మరియు సమూహ ఆధారిత ఆదాయ కార్యక్రమాలపై తొమ్మిది అంశాలతో సమగ్ర కార్యాచరణ రూపొందించాలని మంత్రి సూచించారు. రైతులకు పంటల సాగులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వారి అవసరాలకు అనుగుణంగా పథకాలను అమలు చేయాలని తెలిపారు. అడవి జంతువులు, పశువుల వల్ల పంటలకు నష్టం కలగకుండా సౌర విద్యుత్ కంచెల ఏర్పాటును ప్రోత్సహించాలని, వ్యక్తిగతంగా ఏర్పాటు చేయడం కంటే రైతుల సమూహాల ద్వారా చేపట్టడం వల్ల ఖర్చు తగ్గే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. చిన్న, సన్నకారు రైతులకు అదనపు ఆదాయం కల్పించేందుకు మల్బరీ సాగు, పట్టు పురుగుల పెంపకంపై శిక్షణ అందించాలని, విజయవంతమైన పట్టు పరిశ్రమ కేంద్రాలను సందర్శించే అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. పంటల నిల్వకు అవసరమైన గోదాముల నిర్మాణంతోపాటు భూమిలేని పేద ఎస్సీ కుటుంబాలను గోదాముల నిర్వహణలో భాగస్వాములుగా చేయాలని సూచించారు. కూరగాయల నిల్వ కోసం చిన్నస్థాయి శీతల నిల్వ కేంద్రాలు ఏర్పాటు చేసి వాటి నిర్వహణ బాధ్యతలను పేద కుటుంబాలకు అప్పగించడం ద్వారా నిరంతర ఆదాయం కల్పించే విధానాన్ని రూపొందించాలని తెలిపారు.

డ్రోన్లు, విద్యుత్ వాహనాల ఛార్జింగ్ కేంద్రాలతో యువతకు ఉపాధి

మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ యువతకు ఆధునిక ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రి పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోని డ్రోన్ పైలట్ శిక్షణ కేంద్రాల ద్వారా యువతకు శిక్షణ ఇచ్చి, అనంతరం డ్రోన్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ఇతర రైతులకు సేవలు అందించడం ద్వారా శిక్షణ పొందిన యువత స్వయం ఉపాధి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే విద్యుత్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు విద్యుత్ వాహనాల ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుతో వ్యాపార అవకాశాలు కల్పించే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన పెట్టుబడి, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ రాయితీలు, అనువైన ప్రాంతాలు, నిర్వహణ ఖర్చులపై సమగ్ర నివేదిక రూపొందించాలని సూచించారు. ఎస్సీ రైతులు పండించిన పంటలకు మెరుగైన ధర లభించేలా రైతుల సూపర్ మార్కెట్ల ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలించాలని మంత్రి తెలిపారు. పంటల సేకరణ నుంచి ప్రాసెసింగ్, ప్యాకింగ్, బ్రాండింగ్, విక్రయాల వరకు రైతులే భాగస్వాములయ్యేలా మార్కెటింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయాలని సూచించారు. దీనివల్ల మధ్యవర్తులపై ఆధారపడే పరిస్థితి తగ్గి రైతులకు మెరుగైన ఆదాయం లభించడంతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.

పశుసంవర్ధక, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం

పశుసంవర్ధక రంగంపై ఆధారపడిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు పశువైద్య సేవలు అందుబాటులో ఉండేలా సంచార పశువైద్య కేంద్రాలు, మందుల సరఫరా, వ్యాధి నిరోధక టీకాలు, పశువుల బీమా, పశుగ్రాసం వంటి అంశాలతో సమగ్ర ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడం కష్టమైన గిరిజన ఆవాసాల్లో సౌర విద్యుత్ పంపుసెట్లు, సమూహ సౌర విద్యుత్ సదుపాయాల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. ఎస్సీ కాలనీలు, ఎస్టీ ఆవాసాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లను గుర్తించి అవసరమైన మార్పులు చేపట్టేందుకు నియోజకవర్గాలవారీగా వివరాలు సేకరించాలని ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లో రహదారులు, కల్వర్టుల నిర్మాణానికి ఎదురవుతున్న అనుమతుల సమస్యలను పరిష్కరించేందుకు అటవీ, రోడ్లు--భవనాలు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో ప్రత్యామ్నాయ కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

పారిశ్రామిక రాయితీలు, పెండింగ్ బిల్లుల పరిష్కారం

ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు పెట్టుబడి రాయితీలు, పావలా వడ్డీ, విద్యుత్ ఛార్జీల తిరిగి చెల్లింపు వంటి ప్రోత్సాహక పథకాల అమలును మంత్రి సమీక్షించారు. ఆయా పథకాల కింద వచ్చిన దరఖాస్తులు, అర్హత పొందిన పరిశ్రమలు, మంజూరైన మొత్తాలు, విడుదలైన నిధులు, పెండింగ్ చెల్లింపుల వివరాలను పథకాలవారీగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. యువత సంప్రదాయ వ్యాపారాలకే పరిమితం కాకుండా ఆధునిక సేవారంగాల్లోనూ వ్యాపారాలు ప్రారంభించేలా ప్రత్యేక ప్రోత్సాహక విధానాలను పరిశీలించాలని తెలిపారు. నిధుల వినియోగంలో నిర్లక్ష్యానికి తావులేదు. ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధుల కేటాయింపులు, విడుదలలు, వాస్తవ వ్యయాల మధ్య ఉన్న వ్యత్యాసాలపై మంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించినంత మాత్రాన అభివృద్ధి జరిగినట్లు కాదని, అవి అర్హులైన లబ్ధిదారులకు చేరి వాస్తవ ప్రయోజనం కలిగించినప్పుడే లక్ష్యం నెరవేరుతుందని స్పష్టం చేశారు. ప్రతి శాఖ తనకు కేటాయించిన నిధుల వినియోగంపై పూర్తి బాధ్యత వహించాలని, బడ్జెట్ కేటాయింపులు, ప్రభుత్వ ఉత్తర్వులు, నిధుల



విడుదల ఉత్తర్వులు, ఖజానా ద్వారా విడుదలైన నిధులు, వాస్తవంగా చేసిన ఖర్చులను వేర్వేరుగా నమోదు చేయాలని సూచించారు. సాధారణ పథకాల కింద చేసిన వ్యయాలను ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద చేసిన ఖర్చులతో కలిపి చూపరాదని స్పష్టం చేశారు. అమలులో లేని పాత పథకాల పేర్లతో నిధులు ఖర్చు చేయకుండా నిలిచిపోకుండా ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పథకాలను రూపొందించాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా ఒక పథకంలో మిగిలిన నిధులను మరో అవసరమైన పథకానికి వినియోగించే అవకాశాలను ఆర్థిక శాఖతో చర్చించాలని తెలిపారు. ప్రతి శాఖ నోడల్ అధికారిని నియమించి లబ్ధిదారుల గుర్తింపు, నిధుల అవసరం, అమలు లక్ష్యాలు, కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు.

రూ.242 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలపై ప్రత్యేక దృష్టి

ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు సంబంధించిన ఆరోగ్యశ్రీ వైద్య సేవల బిల్లుల పెండింగ్ అంశాన్ని సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. 2025, 2026 సంవత్సరాలకు సంబంధించి సుమారు రూ.242 కోట్ల మేర వైద్య చికిత్సల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు వివరించారు. ఈ బకాయిల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, అర్హులైన రోగులకు వైద్య సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. విద్యార్థులకు సంబంధించిన పెండింగ్ ఉపకార వేతనాల చెల్లింపులు, గురుకుల విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, భవన నిర్మాణాలు, వసతి గృహాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎస్సీ గురుకుల కళాశాలల్లో అవసరమైన సదుపాయాల కల్పన, సామాజిక భవనాలు, మండల స్థాయిలో చిన్న సమావేశ మందిరాల నిర్మాణ ప్రతిపాదనలను కూడా సమీక్షించారు.

విద్యార్థులకు మెరుగైన భోజనం.. 39 కేంద్రీకృత వంటశాలలు

సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు చేపట్టిన కేంద్రీకృత వంటశాలల నిర్మాణ పురోగతిని మంత్రి సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా 39 కేంద్రీకృత వంటశాలల ఏర్పాటును 2026 డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పనులను వేగవంతం చేయడంతోపాటు వాటి నిర్వహణకు అవసరమైన నిధులు నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. గిరిజన విద్యాసంస్థల్లో వంటశాలల ఆధునికీకరణ, విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన భోజన సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.

విద్యార్థులకు ప్రత్యేక అధ్యయన కేంద్రాలు.. పోటీ పరీక్షలకు శిక్షణ

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాలు, పోటీ పరీక్షల్లో మెరుగైన అవకాశాలు సాధించేలా జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక అధ్యయన కేంద్రాలు ఏర్పాటు చేసే ప్రతిపాదనను మంత్రి పరిశీలించారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాలు, సామాజిక భవనాలను వినియోగించుకుంటూ స్థానిక అధ్యయన కేంద్రాలతో అనుసంధానం చేయాలని సూచించారు. గ్రూప్స్, సివిల్స్, బ్యాంకింగ్, రైల్వే, ఎస్ఎస్సీ, పోలీస్ తదితర పోటీ పరీక్షలకు శిక్షణతోపాటు ఆంగ్ల భాషలో సంభాషణ నైపుణ్యాలు, కంప్యూటర్ పరిజ్ఞానం, డిజిటల్ నైపుణ్యాలు పెంపొందించే కార్యక్రమాలను రూపొందించాలని తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థుల సంఖ్యతోపాటు ఉద్యోగాలు సాధించిన వారి వివరాలను కూడా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

వారం రోజుల్లో కార్యాచరణ ప్రణాళికలు.. ప్రతి వారం పురోగతి నివేదికలు

సమావేశంలో మంత్రి అధికారులకు స్పష్టమైన గడువులు విధించారు. ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద అమలవుతున్న పథకాల అనుసంధానాన్ని మరోసారి పరిశీలించి, లబ్ధిదారుల ఆధారిత పథకాలు, మౌలిక సదుపాయాల పనులను వేర్వేరుగా గుర్తించాలని సూచించారు. సవరించిన ప్రతిపాదనలను వారం రోజుల్లోగా సమర్పించాలని, పెండింగ్‌లో ఉన్న చెక్కులు, టోకెన్లు, బిల్లుల చెల్లింపులపై తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి శాఖకు 2026 డిసెంబర్, 2027 మార్చి చివరి నాటికి సాధించాల్సిన లక్ష్యాలను నిర్దేశించి, వాటి అమలుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. నిధుల వినియోగం, పనుల పురోగతి, లబ్ధిదారుల సంఖ్య, పెండింగ్ సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై వారంవారీ నివేదికలు సమర్పించే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు, శాఖల కార్యదర్శులు, శాఖాధిపతులు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనుల అమలును పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, ఆర్థిక సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. కేటాయించిన నిధులు వినియోగం కాకుండా మిగిలిపోవడం, అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనాలు చేరడంలో జాప్యం జరగడం వంటి పరిస్థితులకు తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. బడ్జెట్ కేటాయింపుల నుంచి లబ్ధిదారుల జీవితాల్లో మార్పు వచ్చే వరకు ప్రతి దశలో జవాబుదారీతనం ఉండాలని, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు తాత్కాలిక ఆర్థిక సహాయంతోపాటు శాశ్వత ఆదాయం, నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, గౌరవప్రదమైన జీవనోపాధి కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి, పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ఆర్థిక శాఖ కార్యదర్శి స్థిగ్ధా పట్నాయక్, గృహ నిర్మాణ శాఖ ఉపాధ్యక్షుడు, మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్, వ్యవసాయ శాఖ సంచాలకుడు గోపి, భూగర్భ జలాల శాఖ సంచాలకుడు కె. లక్ష్మా, పమిలా సత్పతి, పురపాలక పరిపాలన శాఖ అదనపు కమిషనర్ రాధికా గుప్తా, గిరిజన సంక్షేమ శాఖ సంచాలకుడు సంతోష్, విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలస్, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శృతి ఓజా, కుటుంబ సంక్షేమ కమిషనర్ సంగీత సత్యనారాయణతోపాటు వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ సవరణ ఫిక్స్

"చరిత్ర ఎప్పుడూ పాత గణాంకాల వద్ద ఆగిపోదు. పెరిగిన ప్రజల ఆశయాలకు తగ్గట్లుగా ప్రజాస్వామ్య వేదికను విస్తరించడమే నిజమైన రాజనీతిజ్ఞత."1971 నాటి జనాభా లెక్కల ఆధారంగా నిర్ణయించిన 543 లోక్‌సభ స్థానాలతోనే నేటికీ దేశం నడుస్తుండటం పార్లమెంటరీ వ్యవస్థలోని అసమతుల్యతకు నిదర్శనం. అప్పటికీ ఇప్పటికీ దేశ జనాభా దాదాపు మూడు రెట్లు పెరిగింది. ఒక ఎంపీ ప్రాతినిధ్యం వహించే ఓటర్ల సంఖ్య లక్షల నుంచి కోట్ల స్థాయికి చేరింది. ఇలాంటి పరిస్థితుల్లో పెరిగిన జనాభాకు న్యాయం చేయాలని, ప్రాతినిధ్య ప్రాతిపదికను బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే, కాంగ్రెస్ సహా విపక్షాలు మాత్రం పాత పల్లవినే అందుకుంటున్నాయి. "ఉన్న సీట్లను అలాగే ఉంచండి.. పునర్విభజన వద్దు" అంటూ అవి చేస్తున్న వాదనలో ప్రజాస్వామ్య స్పృహ, పరిపాలనా సంస్కరణల కంటే రాజకీయ స్వార్థం, అభద్రతాభావమే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అసలు నియోజకవర్గాల పునర్విభజన ఎందుకు అత్యవసరమో పరిశీలిస్తే, పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడమే దీని ప్రధాన ఉద్దేశం. జనాభా విపరీతంగా పెరిగిన చోట ఒకే ప్రజాప్రతినిధిపై పనిభారం పెరిగి, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోంది. ఇక 'ప్రో-రేటా' విధానం ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేకుండా అందరికీ సమాన న్యాయం జరిగేలా చూడవచ్చు. జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు సాధించిన విజయాన్ని శిక్షగా మార్చకుండా, ఆయా రాష్ట్రాల ప్రస్తుత సీట్ల వాటా తగ్గకుండా నిష్పత్తి ప్రకారం సీట్లను పెంచే సమతూక విధానంతో దక్షిణాది ప్రయోజనాలను పూర్తిగా కాపాడవచ్చు. నిజానికి, ఏ విధానపరమైన చర్చా లేకుండానే డీలిమిటేషన్‌పై దక్షిణాదిలో భయాందోళనలు రేకెత్తించాలని విపక్షాలు చేస్తున్న ప్రయత్నాల్లోని డొల్లతనం ఇట్టే బయటపడుతోంది. గతంలో జనాభా నియంత్రణను ప్రోత్సహించేందుకు రాజ్యాంగ సవరణల ద్వారా పునర్విభజనను వాయిదా వేసిన మాట వాస్తవమే అయినా, శాశ్వతంగా జనాభా వాస్తవాలను విస్మరించడం ప్రజాస్వామ్యానికి శ్రేయస్కరం కాదు. నూతన పార్లమెంటు భవనం విస్తృత ప్రాతినిధ్యానికి వీలుగా నిర్మితమైనందున ,పారదర్శకతతో కూడిన, అన్ని రాష్ట్రాలకు న్యాయం చేసే డీలిమిటేషన్ ప్రక్రియపై నిర్మాణాత్మక చర్చ జరగాల్సిన సమయం ఆసన్నమైంది.ఒకసారి గణాంకాలను పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది. 1971 జనాభా లెక్కల ప్రకారం భారతదేశ జనాభా సుమారు 54.8 కోట్లు. అప్పుడు సగటున 10 లక్షల మంది పౌరులకు ఒక లోక్‌సభ సభ్యుడు ప్రాతినిధ్యం వహించేవారు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా జనాభా నియంత్రణను ప్రోత్సహించే ఉద్దేశంతో సీట్ల సంఖ్యను 543 వద్ద స్తంభింపజేశారు. ఆ తర్వాత 2001లో 84వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆ గడువును 2026 తర్వాత జరిగే మొదటి జనగణన వరకు పొడిగించారు. నేడు 2026 నాటికి భారతదేశ జనాభా 145 కోట్ల మార్కును దాటేసింది. అంటే 1971 నాటి జనాభాకు, నేటి జనాభాకు ఏమైనా సంబంధం ఉందా? అస్సలు లేదు! నేడు ఒక లోక్‌సభ ఎంపీ సగటున 26 లక్షల నుంచి 30 లక్షల మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహించాల్సి వస్తోంది. కొన్ని నగర నియోజకవర్గాల్లో ఉదాహరణకు మల్కాజిగిరి లేదా బెంగళూరు నార్త్ వంటి చోట్ల ఓటర్ల సంఖ్యే 30 లక్షలకు పైగా ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో, ఒక ఎంపీ ఇంత భారీ జనాభా సమస్యలను పార్లమెంటులో ఎలా వినిపించగలరు? అమెరికా కాంగ్రెస్‌లో ప్రతి 7.8 లక్షల మందికి ఒక ప్రతినిధి ఉంటే, మనం మాత్రం 30 లక్షల మందికి ఒక ఎంపీని ఇచ్చి చేతులు దులుపుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం. కనీసం కౌన్సిలర్లు, కార్పొరేటర్ల సంఖ్యను పెంచుతున్న మనం, చట్టసభల సభ్యుల సంఖ్యను 55 ఏళ్లుగా పెంచకపోవడం ఏ రకమైన న్యాయం?నియోజకవర్గాల పునర్విభజన అనగానే విపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్, డీఎంకే వంటి పార్టీలు ప్రధానంగా లేవనెత్తుతున్న భయం జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తే, జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయి. ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యం పెరుగుతుంది అన్నది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 ప్రకారం కేవలం ప్రస్తుత జనాభా నిష్పత్తిలోనే సీట్లు విభజిస్తే ఆ ఆందోళనలో కొంత అర్థం ఉండేది.ఒకవేళ 543 సీట్లను నేటి జనాభా ప్రకారం పంచితే, దక్షిణాది రాష్ట్రాల వాటా 24 శాతం నుంచి 19 శాతానికి పడిపోయే ప్రమాదం ఉందని కార్నెగీ ఎండోమెంట్, పీఆర్ఎస్ వంటి సంస్థలు విశ్లేషించాయి. కానీ, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం అది కాదు! కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటు సాక్షిగా, బహిరంగ వేదికల మీదా స్పష్టమైన హామీ ఇచ్చారు?"ప్రో-రేటా పద్ధతిలో సీట్లను పెంచుతాం. ఏ ఒక్క దక్షిణాది రాష్ట్రం కూడా తనకున్న ఒక్క సీటును గానీ, తన ప్రస్తుత ప్రాతినిధ్య శాతాన్ని గానీ కోల్పోదు" అని. తెలుగు రాష్ట్రాల విషయానికే వస్తే, ఆంధ్రప్రదేశ్ లోక్‌సభ సీట్లు 25 నుంచి 38కి పెరుగుతాయి . పార్లమెంటులో వాటా 4.60% నుంచి 4.65%కి చేరుతుంది. అలాగే తెలంగాణ సీట్లు 17 నుంచి 26కి పెరుగుతాయి . వాటా 3.13% నుంచి 3.18%కి ఎగబాకుతుంది . పొరుగు రాష్ట్రాలైన తమిళనాడులో సీట్లు 39 నుంచి 59కి, కర్ణాటకలో 28 నుంచి 42కి చేరుకుంటాయి. మొత్తంగా చూస్తే, దక్షిణాది రాష్ట్రాల మొత్తం లోక్‌సభ సీట్లు 129 నుంచి 195కి పెరగడమే కాకుండా, మొత్తం సభలో దక్షిణాది వాటా 23.76 శాతం నుంచి 23.87 శాతానికి స్వల్పంగా పెరుగుతుంది తప్ప ఏమాత్రం తగ్గదు. . దేశంలో 33 శాతం మహిళా రిజర్వేషన్ల బిల్లు నారీ శక్తి వందన్ అధినేయం అమలు కావాలన్నా, కొత్త నాయకత్వం ఎదగాలన్నా డీలిమిటేషన్ అనివార్యం. పాత నియోజకవర్గాల భౌగోళిక సరిహద్దులను అలాగే ఉంచడం వల్ల?దశాబ్దాలుగా కొన్ని కుటుంబాలు, కొందరు పాత నేతలు తమ గుప్పిట్లో పెట్టుకున్న 'సేఫ్ సీట్లు' చెక్కుచెదరకుండా ఉంటాయన్నది కాంగ్రెస్ ఆలోచన. అంతేకాదు, 2002?2008 మధ్య యూపీఏ హయాంలో 2001 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రాల లోపల నియోజకవర్గాల సరిహద్దులు మార్చినప్పుడు లేని అభ్యంతరం, ఇప్పుడు సీట్ల సంఖ్య పెంచుతామంటే ఎందుకు వస్తోంది?ప్రజాస్వామ్యంలో గడియారపు ముల్లును వెనక్కి తిప్పడం సాధ్యం కాదు. మారుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజాప్రతినిధుల సంఖ్య పెరగకపోతే, ప్రజల గొంతుక పార్లమెంటు గడప దాటలేక మూగబోతుంది. 1971 నాటి పాత లెక్కల చొక్కాను 2026 నాటి యువ భారతానికి తొడగాలనుకోవడం అవివేకం. నిష్పత్తి తగ్గకుండా, ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకుండా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 'ప్రో-రేటా' డీలిమిటేషన్ విధానం దేశ సమైక్యతకు, ప్రజాస్వామ్య పరిణతికి నిదర్శనం. అపోహల పొగమంచును తొలగించి, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే రాజకీయాలను పక్కనపెట్టి?కొత్త తరం అవసరాలకు తగ్గట్టుగా చట్టసభలను విస్తరించుకోవడం నేడు ప్రతి భారతీయుడి బాధ్యత. డీలిమిటేషన్ అనేది ఏ ఒక్క పార్టీకో, ఏ ఒక్క ప్రాంతానికో చెందింది కాదు; అది 145 కోట్ల మంది భారతీయుల గొంతుకను మరింత బలంగా వినిపించే ప్రజాస్వామ్య మహా యజ్ఞం!

జై భీమ
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

అలియాస్ రుక్మిణి' నా కెరీర్‌లో బెస్ట్ సినిమా అవుతుంది. : హీరో నితిన్

నేచురల్ స్టార్ నాని యూనానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై డిఫరెంట్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'అలియాస్ రుక్మిణి' ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. నితిన్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాకు 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్నారు. దీప్తి గంటా నిర్మిస్తున్నారు. ఇప్పటికే గ్లింప్స్, పోస్టర్లు, పాటలతో మంచి బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమా నుంచి తాజాగా థియేట్రికల్ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. నాని తన ఎక్స్ అకౌంట్ ద్వారా ట్రైలర్‌ను షేర్ చేస్తూ.. "ఈ డిసెంబర్ 4న మీ ఇంటికి తీసుకెళ్లేలా ఒక మంచి సినిమాను ఇస్తానని ప్రామిస్ చేస్తున్నాను. థియేటర్లకు వస్తే.. మిమ్మల్ని బాగా చూసుకుంటాడు కృష్ణ :)" అని ట్వీట్ చేశారు. కృష్ణ మిడిల్ క్లాస్ యువకుడు, ఫ్యామిలీ కోర్టులో స్టెనోగ్రాఫర్‌గా పనిచేసే కృష్ణకు వచ్చే విచిత్రమైన కలలే అతడిని అడల్ట్ నవలలు రాసేలా చేస్తాయి. అయితే రుక్మిణి అనే కలం పేరుతో అతను రాసిన నవలలు అనూహ్యంగా బెస్ట్ సెల్లర్స్‌గా మారతాయి. కానీ ఆ రచనల వెనుక ఉన్న అసలు విషయం అతడి వ్యక్తిగత జీవితంలో సమస్యలకు కారణమవుతుంది. ఇప్పటికే ముగ్గురు అమ్మాయిల దగ్గర తిరస్కరణ ఎదుర్కొన్న కృష్ణ జీవితంలోకి నాలుగో అమ్మాయి వస్తుంది. కొంత సమయం తీసుకున్న తర్వాత ఆమె కృష్ణను పెళ్లి చేసుకోవడానికి అంగీకరిస్తుంది. ఇద్దరూ కలిసి సంతోషంగా జీవించగలమని భావిస్తున్న సమయంలో కృష్ణ అసలు గుర్తింపు, అతను రాసిన నవలల వెనుక ఉన్న నిజం ఆమెకు తెలుస్తుంది. దీంతో వారి బంధంలో అనుకోని పరిణామాలు చోటు చేసుకుంటాయి. ట్రైలర్‌లో సినిమా కథాంశాన్ని ఆసక్తికరంగా పరిచయం చేస్తూనే, అసలు సమస్యను మాత్రం పూర్తిగా రివీల్ చేయలేదు. దర్శకుడు మురళీకాంత్ దేవసోత్ హ్యూమర్, రొమాన్స్, ఎమోషన్స్, ఫ్యామిలీ డ్రామాను కలిపి ఒక ఎంటర్‌టైనింగ్ కథనాన్ని రూపొందించారు. కృష్ణ ఎదుర్కొనే విచిత్రమైన పరిస్థితులు, అతడి రహస్యం వల్ల ఎదురయ్యే పరిణామాలపై క్యూరియాసిటీ పెంచేలా ట్రైలర్ కట్ చేశారు. కృష్ణ పాత్రలో నితిన్ ఒక సాధారణ మిడిల్ క్లాస్ యువకుడిలో ఉండే అమాయకత్వం, ఇబ్బందికరమైన పరిస్థితులు, భావోద్వేగాలను తన ఎక్స్‌ప్రెషన్స్, బాడీ లాంగ్వేజ్‌తో చక్కగా చూపించారు. కామెడీతో పాటు ఎమోషన్స్‌ను కూడా బ్యాలెన్స్ చేసేలా ఆయన పాత్ర ఆకట్టుకుంది. హీరోయిన్‌గా ఆఫియా సయ్యద్ ఆకట్టుకున్నారు. తన పాత్రలో ఉండే చలాకీతనం, ప్రేమ, ఎమోషన్స్‌ను చక్కగా పలికించారు. నితిన్, ఆఫియా జోడీ ఫ్రెష్‌గా కనిపిస్తోంది. హర్షవర్ధన్, సాయికుమార్ కీలక పాత్రల్లో కనిపించి కథకు మరింత బలాన్ని చేకూర్చారు. టెక్నికల్‌గా కూడా ట్రైలర్ ఆకట్టుకుంటోంది. జోమోన్ టి. జాన్ ఐఎస్‌సీ సినిమాటోగ్రఫీ కథనానికి మంచి విజువల్ ఫ్లోను అందించింది. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ కథకు తగిన సహజత్వాన్ని తీసుకొచ్చింది. విజయ్ బుల్గానిన్ సంగీతం ఈ సినిమాకు ప్రధాన బలాల్లో ఒకటిగా నిలవనుంది. రొమాంటిక్, కామెడీ, ఎమోషనల్ సన్నివేశాలకు ఆయన అందించిన సంగీతం చక్కగా కుదిరింది. సృజన ఆడుసుమిల్లి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 'అలియాస్ రుక్మిణి' డిసెంబర్ 4న గ్రాండ్‌గా థియేటర్లలో రిలీజ్ కానుంది. ఆసక్తికరమైన కథాంశం, రిలేటబుల్ క్యారెక్టర్లు, రొమాన్స్, కామెడీ, ఫ్యామిలీ డ్రామాతో ఈ సినిమా ఒక మంచి రోలర్ కోస్టర్ రైడ్ ఇవ్వబోతున్నట్లు ట్రైలర్ హామీ ఇస్తోంది. ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమా ట్రైలర్‌తో అంచనాలు మరింత పెరిగాయి. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో నితిన్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. 'అలియాస్ రుక్మిణి' నా కెరీర్‌లో చాలా స్పెషల్ సినిమా. గతంలో నా సినిమాలు కొన్ని కమర్షియల్ లెక్కలు వేసుకుని చేశాను. కానీ ఫస్ట్ టైమ్ ఎలాంటి లెక్కలు వేసుకోకుండా, కథ నచ్చి మనస్ఫూర్తిగా చేసిన సినిమా ఇది. ఇందులో పాటలు ఉన్నాయా? ఫైట్లు ఉన్నాయా? డాన్సులు ఉన్నాయా? ఇలాంటివేమీ ఆలోచించలేదు. నా మనసుకు నచ్చి ఈ సినిమా చేశాను. సినిమా చూశాక మీకు కూడా నచ్చుతుందని అనుకుంటున్నాను. మా డైరెక్టర్‌కి ఒక విషయం క్లియర్‌గా చెప్పాను. కేవలం కంటెంట్‌ను నమ్మి, మంచి కథతో సినిమా చేద్దామని చెప్పే ఈ సినిమాను చేశాను. దీప్తి గారు ఈ సినిమాకు బిగ్గెస్ట్ పిల్లర్. ఒక బిడ్డను తల్లి ఎంత జాగ్రత్తగా చూసుకుంటుందో, ఈ సినిమాను దీప్తి గారు అంత జాగ్రత్తగా చూసుకున్నారు. చాలా రోజుల తర్వాత అన్ని డిపార్ట్‌మెంట్స్‌లో ఇన్వాల్వ్ అవుతూ, ప్రతి విషయంలో జాగ్రత్తలు తీసుకున్న ఒక ప్రొడ్యూసర్‌తో పని చేశాను. తను మా సినిమాకు శివగామి (నవ్వుతూ) విజయ్ మా సినిమాకు అద్భుతమైన పాటలు ఇచ్చారు. ఆ పాటలు ఇప్పటికే విజయవంతమయ్యాయి. ఆయన అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా అద్భుతంగా ఉంది. సినిమా చూశాక ఈ పాటలను మళ్లీ రిపీట్ మోడ్‌లో పెట్టుకుంటారు. 'ఇష్క్' తర్వాత నాకు మళ్లీ ఆ రేంజ్ సాంగ్స్ పడ్డాయి. ఆఫియా చాలా అద్భుతమైన నటి. ఈ సినిమాలో తను మిమ్మల్ని సర్‌ప్రైజ్ చేస్తుంది. అలాగే మా ఎడిటర్ సృజన కూడా ఈ సినిమాకు బిగ్గెస్ట్ పిల్లర్. మా డైరెక్టర్ మురళి గురించి ఒకే మాట చెప్తాను. తను తెలుగు సినిమాకు ఒక రాజ్‌కుమార్ హిరణి. ఇది నా స్ట్రాంగ్ ఫీలింగ్. మీరు సినిమా చూసిన తర్వాత మీకు కూడా అదే అనిపిస్తుంది. ఒకే సీన్‌లో నవ్విస్తాడు, ఏడిపిస్తాడు, ఆలోచింపజేస్తాడు. కృష్ణ క్యారెక్టర్‌ను తప్పకుండా మీరందరూ ఇష్టపడతారని నమ్ముతున్నాను. ఈ సినిమాకు మరో సీక్రెట్ సూపర్‌స్టార్ ఉన్నారు. నాని . తను లేనిదే ఈ సినిమా లేదు. కమర్షియల్ సినిమాలు చేసే నాతో ఇలాంటి కంటెంట్ ఉన్న సినిమాలు కూడా చేస్తానని నమ్మారు. నా కెరీర్‌లో బెస్ట్ సినిమా ఇచ్చిన నానికి థాంక్యూ. లవ్ యూ నాని. డిసెంబర్ 4న సినిమా వస్తోంది. కచ్చితంగా మీరందరూ ఎంజాయ్ చేస్తారు. అదే రోజు 'వృషకర్మ' సినిమా కూడా వస్తోంది. అన్ని సినిమాలు ఆడాలి. తెలుగు ఇండస్ట్రీ బాగుండాలి. జై తెలుగు సినిమా! హీరోయిన్ ఆఫియా సయ్యద్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ మూవీతో మీ ముందుకు రావడం చాలా ఆనందంగా ఉంది. ఇది చాలా బ్యూటిఫుల్ సినిమా. మీరందరూ ఇష్టపడతారని నమ్ముతున్నాను. నాకు ఈ అవకాశం ఇచ్చిన నితిన్ గారికి, నాని గారికి థాంక్యూ సో మచ్. డిసెంబర్ 4న అందరూ థియేటర్లలో సినిమా చూడాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్ మురళీకాంత్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. నితిన్ అన్నకి థాంక్యూ. డిసెంబర్ 4న మీరందరూ ఒక అందమైన సినిమాను చూస్తారు. కచ్చితంగా ప్రేమిస్తారు. చాలా కష్టపడి, ఇష్టపడి చేసిన సినిమా ఇది. నాకు ఈ అవకాశం ఇచ్చిన నితిన్ గారికి, నాని గారికి, దీప్తి గారికి ధన్యవాదాలు. మా టీమ్ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. డిసెంబర్ 4న అందరం థియేటర్లలో కలుద్దాం. నిర్మాత దీప్తి గంటా మాట్లాడుతూ.. ట్రైలర్ మీ అందరికీ నచ్చినందుకు చాలా హ్యాపీగా ఉంది. సినిమా ఇంకా బాగా నచ్చుతుంది. నితిన్ ఫ్యాన్స్‌గా థియేటర్‌కు వచ్చిన మీరు, సినిమా చూసిన తర్వాత కృష్ణ ఫ్యాన్స్‌గా తిరిగి వెళ్తారు. అంత అద్భుతంగా నితిన్ నటించారు. ఈ టీమ్‌తో నాకు చాలా ప్రత్యేకమైన అనుబంధం ఉంది. డిసెంబర్ 4న ఒక బ్యూటిఫుల్ సినిమా చూస్తారు. అప్పుడు మళ్లీ మాట్లాడుకుందాం. సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్ మాట్లాడుతూ.. ట్రైలర్ మీ అందరికీ నచ్చినందుకు హ్యాపీగా ఉంది. సినిమా ఇంకా బాగుంటుంది. నాకు ఇంత మంచి సినిమా ఇచ్చిన నాని గారికి, నితిన్ గారికి, మురళి గారికి ధన్యవాదాలు. నితిన్ గారితో సినిమా చేయడం చాలా లక్కీగా ఫీల్ అవుతున్నాను. రీ-రికార్డింగ్ పూర్తయింది. సినిమా అద్భుతంగా ఉంది. ఈ సినిమా చూసిన తర్వాత మీరు నితిన్ గారితో ప్రేమలో పడతారు. అలాగే మా మ్యూజిక్‌తో కూడా ప్రేమలో పడతారు. నటీనటులు: నితిన్, ఆఫియా సయ్యద్, సాయికుమార్, హర్షవర్ధన్.



ఆస్తి నేరాల నియంత్రణకు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలి





సైబర్ నేరాల నగదు రికవరీలో కామారెడ్డి పోలీసుల పనితీరుపై డీజీపీ సి.వి.ఆనంద్ ప్రశంసలు
అంతర్రాష్ట్ర ముఠాల కట్టడికి ఆపరేషన్ కవచ్..
కామారెడ్డి, బాన్సువాడలో పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

కామారెడ్డి, 27 నవంబర్ 2026(జై భీమ్ న్యూస్)

ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడంతోపాటు నేరాల సంఖ్యను తగ్గించేందుకు పోలీసు యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర డీజీపీ సి.వి.ఆనంద్ స్పష్టం చేశారు. నేరాలు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించాలని, ముఖ్యంగా ఆస్తి సంబంధిత నేరాల నియంత్రణకు పటిష్టమైన కార్యాచరణ అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సైబర్ మోసాలకు గురైన బాధితులకు కోల్పోయిన డబ్బును తిరిగి ఇప్పించడంలో కామారెడ్డి జిల్లా పోలీసులు సాధిస్తున్న ఫలితాలను అభినందించారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో డీజీపీ పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితి, నేరాల నమోదు, కేసుల దర్యాప్తు, సైబర్ నేరాల నియంత్రణ, డ్రగ్స్ అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. గతంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పనిచేసిన రోజుల్ని డీజీపీ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. 1996 ఆగస్టు నుంచి 1999 డిసెంబర్ వరకు దాదాపు మూడున్నరేళ్లు ఇక్కడ విధులు నిర్వహించానని తెలిపారు. ఆ సమయంలో నక్సల్స్ సమస్య తీవ్రంగా ఉండేదని, గ్రామీణ ప్రాంతాల్లో దళాల సంచారం, పట్టణాల్లో టౌన్ పార్టీల కార్యకలాపాలు పోలీసులకు సవాలుగా నిలిచేవని వివరించారు. ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రుల పర్యటనలకు భద్రత కల్పించడం కూడా కష్టంగా ఉండేదన్నారు. అయినప్పటికీ పోలీసుల సమన్వయం, సమష్టి ప్రణాళికతో మూడు ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించగలిగామని గుర్తుచేశారు. ప్రస్తుతం శాంతిభద్రతల పరిస్థితి మెరుగుపడినప్పటికీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని జరుగుతున్న సైబర్ మోసాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా పోలీసులకు కొత్త సవాళ్లుగా మారాయని పేర్కొన్నారు. వీటిని అరికట్టేందుకు ప్రత్యేక నిఘా, సమర్థవంతమైన దర్యాప్తు అవసరమన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న కామారెడ్డి జిల్లాలో అంతర్రాష్ట్ర నేర ముఠాల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. గతంలో ఏడాదికి 10 నుంచి 15 వరకు ముఠాలు జిల్లాలో సంచరించే పరిస్థితి ఉండేదని, వాటి కార్యకలాపాలను అడ్డుకునేందుకు ప్రారంభించిన ఆపరేషన్ కవచ్ సత్ఫలితాలు ఇస్తోందని తెలిపారు. ఈ ఆపరేషన్‌ను మరింత పటిష్టంగా కొనసాగించి నేర ముఠాల కదలికలను నియంత్రించాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల నిర్మూలనను సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డీజీపీ పిలుపునిచ్చారు. 2029 డిసెంబర్ 31 నాటికి దేశాన్ని నషా ముక్త్ భారత్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. డ్రగ్స్ సరఫరా, వినియోగంపై పోలీసు కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్పీ స్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. తెలంగాణలో ఈగల్ వంటి ప్రత్యేక విభాగాల ద్వారా మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సైబర్ నేరగాళ్లు ఏఐ సాంకేతికతను వినియోగించుకుని రోజురోజుకు కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని డీజీపీ హెచ్చరించారు. సుమారు 40 రకాల సైబర్ నేరాల ద్వారా ప్రజల కష్టార్జితాన్ని కాజేస్తున్నారని తెలిపారు. ప్రతి జిల్లాలో ఏర్పాటు చేసిన సైబర్ యూనిట్లు, సైబర్ వారియర్లు బాధితులకు వేగంగా స్పందించి సహాయం అందించాలని, నగదు రికవరీకి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇళ్లు, వాణిజ్య సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాల నియంత్రణకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఆన్‌లైన్ బెట్టింగ్ వంటి వ్యసనాల వల్ల ఆర్థికంగా నష్టపోయి కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఇలాంటి బాధితులకు అవసరమైన కౌన్సెలింగ్ అందించాలని సూచించారు. జిల్లా జనాభా, పట్టణాల విస్తరణ, పెరుగుతున్న నేరాల అవసరాలకు అనుగుణంగా పోలీసు స్టేషన్ల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని డీజీపీ అభిప్రాయపడ్డారు. కామారెడ్డి పట్టణంలో మరో పోలీస్‌స్టేషన్, బాన్సువాడలో అదనపు పోలీస్‌స్టేషన్‌తోపాటు మహిళా, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, బ్లూకోల్ట్స్, టెక్ టీమ్‌లకు తగిన సిబ్బందిని కేటాయించాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్లలో సీసీటీఎన్ఎస్, ఈ-సాక్ష వంటి సాంకేతిక వ్యవస్థలను పూర్తిస్థాయిలో వినియోగించి కేసుల నమోదు, దర్యాప్తు, నేరాల విశ్లేషణలో ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని ఆదేశించారు. డ్రగ్స్ బాధితుల చికిత్స, పునరావాసం కోసం జిల్లాలో డీ-అడిక్షన్ కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీసుల సంక్షేమంలో భాగంగా వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఫిట్‌కాప్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు డీజీపీ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 75 వేల మందికి పైగా పోలీసు సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారికి ఉన్న ఆరోగ్య సమస్యలను గుర్తించి తగిన వైద్య సూచనలు, మార్గదర్శకాలు అందించనున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కామారెడ్డి పోలీసుల పనితీరును వివరించారు. జిల్లాలో నమోదవుతున్న నేరాలు, వాటి దర్యాప్తు, సైబర్ మోసాల నగదు రికవరీ, మొబైల్ ఫోన్ల గుర్తింపు, సిబ్బంది కొరత, రోడ్డు ప్రమాదాల నివారణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలకు సంబంధించిన గణాంకాలను డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. సైబర్ నేరాల బాధితులు పోగొట్టుకున్న నగదును తిరిగి ఇప్పించడంలో జిల్లా పోలీసులు గణనీయమైన పురోగతి సాధించినట్లు ఎస్పీ వెల్లడించారు. 2024లో 55 శాతం, 2025లో 69 శాతం, 2026 నవంబర్ నాటికి 61 శాతం నగదును రికవరీ చేసినట్లు వివరించారు. బాధితుల ఫిర్యాదులపై వేగంగా స్పందిస్తూ నిరంతర పర్యవేక్షణతో ఈ ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ల రికవరీలో కామారెడ్డి జిల్లా రాష్ట్రవ్యాప్తంగా ఏడో స్థానంలో నిలిచిందని తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఫోన్లు పోగొట్టుకున్నట్లు 7,285 ఫిర్యాదులు అందగా, వాటిలో 3,683 ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మొత్తం ఫిర్యాదుల్లో 55 శాతానికి పైగా మొబైల్ ఫోన్లను తిరిగి రికవరీ చేయగలిగామని వెల్లడించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 25 ప్రమాదకర ప్రాంతాలను గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు. ముఖ్యంగా జాతీయ రహదారి 44, రాష్ట్ర రహదారి 765డీ పరిధిలో ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో నమోదవుతున్న మొత్తం నేరాలను పరిశీలించగా కామారెడ్డి టౌన్, దేవునిపల్లి, బాన్సువాడ, బిచ్కుంద, బిక్కనూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో అత్యధిక కేసులు నమోదవుతున్నట్లు గుర్తించామని ఎస్పీ వివరించారు. ఈ ఐదు పోలీస్‌స్టేషన్ల పరిధిలోనే జిల్లాలోని మొత్తం నేరాల్లో 42 శాతం నమోదవుతున్నాయని తెలిపారు. కేసుల దర్యాప్తు, పరిష్కారం, నిందితులకు శిక్షలు పడేలా చర్యలు, అండర్ ట్రయల్ కేసుల పురోగతి, రోడ్డు ప్రమాదాల నియంత్రణ వంటి అంశాల ఆధారంగా పోలీస్‌స్టేషన్ల పనితీరును విశ్లేషిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్రమ ఇసుక రవాణా, ఇతర అక్రమ కార్యకలాపాలపై చేపట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను కూడా ఎస్పీ వివరించారు. 2024లో 36 కేసులు నమోదు చేసి 37 వాహనాలను, 2025లో 313 కేసులు నమోదు చేసి 393 వాహనాలను, 2026 నవంబర్ నాటికి 193 కేసులు నమోదు చేసి 281 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమ గేమింగ్ కార్యకలాపాలపై నమోదైన కేసుల వివరాలను వెల్లడిస్తూ 2023లో 155, 2024లో 207, 2025లో 309, 2026 నవంబర్ నాటికి 376 కేసులు నమోదైనట్లు వివరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై నిరంతరం నిఘా కొనసాగిస్తూ 2023లో 13, 2024లో 24, 2025లో 108, 2026లో ఇప్పటివరకు 135 రౌడీషీట్లు తెరిచినట్లు తెలిపారు. బాన్సువాడ పట్టణంలో 2026 ఫిబ్రవరిలో చోటుచేసుకున్న మతపరమైన ఘర్షణలపై పోలీసులు తక్షణమే స్పందించి 17 కేసులు నమోదు చేశారని, ఈ ఘటనలకు సంబంధించి 41 మందిని అరెస్టు చేసినట్లు ఎస్పీ వివరించారు. అలాగే 2026 నవంబర్ 15 నాటికి జిల్లాలో నమోదైన కేసులు, ఎఫ్ఐఆర్‌లు, దర్యాప్తు పురోగతి, కేసుల పరిష్కారానికి సంబంధించిన సమగ్ర వివరాలను డీజీపీకి సమర్పించారు. జిల్లా పోలీసు శాఖలో మొత్తం 1,158 పోస్టులు మంజూరుకాగా, ప్రస్తుతం 976 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, ఇంకా 182 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎస్పీ వివరించారు. పరిమిత సిబ్బందితో అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుంటూ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఈగల్ ఫోర్స్ ఎస్పీ గిరిధర్ ఎన్‌డీపీఎస్ కేసుల నమోదు, దర్యాప్తు విధానాలపై వివరించగా, సీఐడీ డీఐజీ నారాయణ నాయక్ కొత్త క్రిమినల్ చట్టాల అమలుపై అధికారులకు అవగాహన కల్పించారు. సోషల్ మీడియా వేదికలపై అభ్యంతరకర పోస్టులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రచారం, నిరసన కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై డీజీపీ పలు సూచనలు చేశారు. ఈ సమీక్ష సమావేశంలో ఐజీ కార్తికేయ (మల్టీజోన్-1), సీఐడీ డీఐజీ నారాయణ నాయక్, జోన్-3 డీఐజీ సన్‌ప్రీత్ సింగ్, కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర, సైబర్ సెక్యూరిటీ ఎస్పీ హర్షవర్ధన్, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఈగల్ ఫోర్స్ ఎస్పీ గిరిధర్‌తోపాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

యూత్ కు నచ్చే అన్ని ఎలిమెంట్స్ తో "సిద్ధుగాడి లవ్ స్టోరీ" సినిమా - డైరెక్టర్ రమేష్ బాబు చెరుకూరు

మనోజ్, శృతి, మోహన సిద్ధి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "సిద్ధుగాడి లవ్ స్టోరీ". ఈ చిత్రాన్ని శివ బ్రహ్మేంద్ర క్రియేషన్స్ పతాకంపై బాల బ్రహ్మచారిచెరుకూరు శివ బ్రహ్మిణి చెరుకూరు సమర్పణలో, నిర్మాత సావిత్రమ్మ చెరుకూరు నిర్మిస్తున్నారు. యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ గా తెరకెక్కిన "సిద్ధుగాడి లవ్ స్టోరీ" సినిమా ఈ నెల 27న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ రోజు ఈ చిత్ర ప్రెస్ మీట్ ను హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ వైవి రావు మాట్లాడుతూ - యూత్ కు నచ్చే సినిమాలు తప్పకుండా విజయం సాధిస్తాయి. అలాంటి కంటెంట్ తో వస్తున్న మా సిద్ధుగాడి లవ్ స్టోరీ కూడ మీ అదరణ పొందుతుంది. అన్నారు. రైటర్ శ్రీధర్ మాట్లాడుతూ - లైఫ్ ను ఎంజాయ్ చేసేందుకు చాలా మంది యూత్ నగరాలకు వెళ్తుంటారు. అలా వెళ్లాక వాళ్లు ఎదుర్కొనే ప్రాబ్లమ్స్ ఎలా ఉంటాయి అనేది మా మూవీలో ఇంట్రెస్టింగ్ గా, కమర్షియల్ ఎలిమెంట్స్ తో చూపిస్తున్నాం. యూత్ అందరికీ మా సినిమా బాగా నచ్చుతుంది. అన్నారు. హీరోయిన్ శృతి మాట్లాడుతూ - ఈ సినిమాలో అల్లరి అమ్మాయిగా కనిపిస్తాయి. కథ ప్రారంభంలో బబ్లీగా ఉండే ఆ తర్వాత నేను హీరో కోసం మారిపోతాను. అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న మంచి చిత్రమిది. మీ అందరినీ ఆకట్టుకుంటుందని నమ్ముతున్నాం. అన్నారు. డైరెక్టర్ రమేష్ బాబు చెరుకూరు మాట్లాడుతూ - నాకు సినిమాలంటే ప్యాషన్. అదే ఇష్టంతో ఈ సినిమాను రూపొందించాను. యూత్ కు బాగా నచ్చేలా ఈ సినిమా ఉంటుంది. అలాగే ఫ్యామిలీ ఆడియెన్స్ కూడా ఇష్టపడతారు. ఈ నెల 27న మా మూవీ రిలీజ్ కు వస్తోంది. మీరంతా తప్పకుండా ఆదరిస్తారని నమ్ముతున్నాను. అన్నారు. హీరో మనోజ్ మాట్లాడుతూ - "సిద్ధుగాడి లవ్ స్టోరీ" ఒక మంచి యూత్ ఫుల్ ఎంటర్ టైనర్. కామెడీ, ఎమోషన్, ఫ్యామిలీ డ్రామా వంటి అన్ని అంశాలు ఈ కథలో ఉన్నాయి. బీటెక్ చదివి సిటీలో కొత్త లైఫ్ స్టార్ట్ చేయాలని వెళ్లే యూత్ అందరూ ఈ సినిమాకు బాగా కనెక్ట్ అవుతారు. నేను నా పర్సనల్ లైఫ్ లో అలాగే హైదరాబాద్ వచ్చాను. నగరానికి చేరుకున్న తర్వాత ఆ యువత ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటారు అనేది మా మూవీలో చూపిస్తున్నాం. నేను ఈ సినిమాలో సిద్ధు క్యారెక్టర్ చేశాను. సాంగ్స్ అదిరిపోయాయి అంటున్నారు. మీకు బాగా కనెక్ట్ అయ్యేలా మూవీ ఉంటుంది. అన్నారు.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM